సాక్షి
ఖమ్మం

శుక్రవారం । 3 । ఫిబ్రవరి । 2023



సాగర్ కాల్వలో రైతుల గల్లంతు

కల్లూరు మండలం కప్పలబంధం వద్ద సాగర్ కాల్వలో ఇద్దరు రైతులు జారిపడగా రాత్రి పొద్దుపోయాక మృతదేహాలు లభించాయి. 8లో



...రోడ్డెక్కిన అన్నదాతలు

బోనకల్ బ్రాంచ్ కెనాల్ పరిధిలో పంటలు ఎండిపోకుండా నీరు అందించాలనే డిమాండ్‌తో రైతులు ఆందోళన చేపట్టారు. 10లో

గరిష్టం / కనిష్టం
33° / 17°

వాతావరణం

శుక్రవారం ఉదయం, సాయంత్రం చలి ప్రభావం పెద్దగా ఉండదు. మధ్యాహ్నం ఉష్ణోగ్రత పెరిగే అవకాశముంది.

న్యూస్‌రీల్

సీఎం కేసీఆర్‌ను కలిసిన మంత్రి పువ్వాడ



సీఎంకు శుభలేఖ అందజేస్తున్న మంత్రి

ఖమ్మంమయూరిసెంటర్: ముఖ్యమంత్రి కేసీఆర్‌ను రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ గురువారం హైదరాబాద్ ప్రగతిభవన్‌లో కలిశారు. ఈనెల 10న ఖమ్మంలో జరగనున్న తన సోదరుడు ఉదయ్‌కుమార్ కుమారుడు డాక్టర్ పువ్వాడ నరేన్ వివాహ రిసెప్షన్‌కు హాజరుకావాలని సీఎంను మంత్రి కోరారు. ఈమేరకు సీఎం కేసీఆర్‌కు శుభలేఖ అందజేశారు.

కంటి పరీక్షలు ఎలా చేస్తున్నారు?



పరీక్షల తీరును పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ స్నేహలత

కొణిజర్ల: మండల కేంద్రంలోని రైతు వేదికలో ఏర్పాటుచేసిన కంటివెలుగు వైద్యశిబిరాన్ని గురువారం అదనపు కలెక్టర్ స్నేహలత తనిఖీ చేశారు. ఈసందర్భంగా 132 మందిని పరీక్షించగా, 81 మందికి ఎలాంటి లోపం లేదని తేలినట్లు వైద్యాధికారి చెప్పడంతో ఆమె ఆశ్చర్యపోయారు. కంటి పరీక్షలు ఎలా చేస్తున్నారు, ఆన్‌లైన్‌లో వివరాల నమోదును పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. శిబిరాల్లో సమయపాలన పాటిస్తూ వచ్చిన వారందరికీ క్షుణ్ణంగా పరీక్షలు చేయాలని ఆదేశించారు. అయితే, కళ్లజోళ్లు సక్రమంగా లేవని స్థానికులు అదనపు కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. ఎంపీడీఓ ఆర్.రమాదేవి, సర్పంచ్ సూరంపల్లి రామారావు, ఎంపీఓ పి.ప్రభాకర్, వైదాధికారి సురేష్, ఏపీఎం సుశీల పాల్గొన్నారు.

అభివృద్ధి పనులను పరిశీలించిన అసిస్టెంట్ కలెక్టర్



ఉపాధి కూలీలతో మాట్లాడుగున్న రాధికాగుప్తా

చింతకాని: మండలంలోని వందనం, కొదుమూరు, లచ్చగూడెం గ్రామాల్లో గురువారం అసిస్టెంట్ కలెక్టర్ రాధికా గుప్తా పర్యటించారు. ఈ సందర్భంగా ఉపాధి హామీ పనులు, పాఠశాలల్లో మన ఊరు–మన బడి కార్యక్రమం ద్వారా చేపట్టిన పనులను తనిఖీ చేసిన ఆమె నర్సరీలు, కేజీబీవీని పరిశీలించారు. ఉపాధి హామీ పనుల పరిశీలన సందర్భంగా కూలీలతో మాట్లాడారు. అలాగే, కేజీబీవీలో విద్యార్థుల సమస్యలు తెలుసుకున్నాక వారితో కలిసి భోజనం చేశారు. ఈ కార్యక్రమాల్లో సర్పంచ్‌లు కొరిపల్లి సునీత, నక్కనబోయిన సుజాత, గురిజాల ఝాన్సీ, డీఆర్డీఓ విద్యాచందన, ఎంపీడీఓ శ్రీనివాసరావు, ఎంపీఓ మల్లెల రవీంద్రప్రసాద్‌తో పాటు గురిజాల హన్మంతరావు, పోటు శ్రీనివాసరావు, చెవుల మహేష్, ఈశ్వరాచారి, శ్రీరాంకుమార్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులను పరీక్షలకు సిద్ధం చేయండి



విద్యార్థులతో మాట్లాడుతున్న డీఈఓ శర్మ

కొణిజర్ల: పదో తరగతి వార్షిక పరీక్షలకు విద్యార్థులను సిద్ధం చేయాలని జిల్లా విద్యాశాఖాధికారి సోమశేఖరశర్మ ఉపాధ్యాయులను ఆదేశించారు. మండలంలోని పెద్దమునగాల, పెద్దగోపతి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలను గురువారం తనిఖీ చేసిన ఆయన పదో తరగతి విద్యార్థుల సామర్థ్యాలను పరీక్షించారు. వెనకబడిన విద్యార్థులకు ప్రత్యేక శిక్షణ ఇవ్వాలని, మన ఊరు – మన బడి పనులను పర్యవేక్షించాలని సూచించారు. హెచ్ఎంలు బి.కృష్ణయ్య, ఆర్.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

అసెంబ్లీకి వేళాయె..



- ఇప్పటికే హైదరాబాద్ చేరిన జిల్లా ఎమ్మెల్యేలు
- అభివృద్ధి పనులకు నిధులతో ప్రతిపాదనలు సిద్ధం
- నిధులపై జిల్లా ప్రజల ఎదురుచూపులు
- సీతారామ ప్రాజెక్టు, రుణమాఫీ, ఇళ్లకు కేటాయింపు ప్రకటనపై ఆసక్తి

సాక్షిప్రతినిధి, ఖమ్మం: రాష్ట్ర అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలకు వేళైంది. శుక్రవారం మొదలుకానున్న అసెంబ్లీ సమావేశాల్లో పాల్గొనేందుకు జిల్లా ఎమ్మెల్యేలు ఇప్పటికే హైదరాబాద్ చేరుకున్నారు. ఎన్నికలకు ముందు ప్రవేశపెడుతున్న బడ్జెట్ కావడంతో నియోజకవర్గాల అభివృద్ధికి అత్యధిక నిధులు రాబట్టాలనే యోచనలో ఎమ్మెల్యేలు ఉన్నారు. ఇప్పటికే నియోజకవర్గాల వారీగా అభివృద్ధి పనులకు ప్రతిపాదనలు సమర్పించారు. ఇక జిల్లాలో ఉన్న ఏకైక ప్రతిపక్ష ఎమ్మెల్యే, సీఎల్పీ నేత మల్లు భట్టి విక్రమార్క సమస్యలను ప్రస్తావించనున్నట్లు పేర్కొన్నారు. మరోపక్క బడ్జెట్‌లో జిల్లాకు ఏ మేరకు కేటాయింపులు ఉంటాయనే అంశంపై ప్రజలు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు.

సాగుతున్న 'సీతారామ'

ఉమ్మడి జిల్లాకు వరప్రదాయినిగా నిలిచే సీతారామ ప్రాజెక్టు అసంపూర్తిగా నిలిచిపోయింది. ప్రాజెక్టుకు సంబంధించి జిల్లాలో వైరా, పాలేరు నియోజకవర్గాల్లో ఇంకా భూసేకరణ పూర్తి కాలేదు. గోదావరి నీళ్లు పాలేరు రిజర్వాయర్‌లో పోసేలా చేపట్టిన ఈ బృహత్తర ప్రాజెక్టు పనులు ఎప్పుడు పూర్తవుతాయా.. అని ఆయకట్టు రైతాంగం ఆశగా ఎదురు చూస్తోంది. మిగిలిన పనులకు ఈ బడ్జెట్‌లో ప్రభుత్వం ఎన్ని నిధులు కేటాయిస్తుందన్నది తేలాల్సి ఉంది. ఉమ్మడి జిల్లాలో కొన్ని చోట్ల కాల్వలు పూర్తి కాగా.. మరికొన్ని చోట్ల భూసేకరణ ప్రధాన అడ్డంకిగా మారింది.

రుణ'మాఫీ' ఎప్పుడు?

పూర్తి స్థాయిలో రుణమాఫీ కోసం జిల్లా రైతాంగానికి ఎదురుచూపులు తప్పడం లేదు. జిల్లాలో 3.25 లక్షల మంది రైతులు రుణమాఫీకి అర్హులుగా ఉన్నారు. ఇందులో ఇప్పటి వరకు 37,371 మంది రైతులకు మాత్రమే రూ.79.96 కోట్ల మేర మాఫీ అయింది. ఇంకా జిల్లాలో రూ.2,348.40 కోట్లు రుణమాఫీ కావాల్సి ఉంది. ఈ రుణాలకు బ్యాంకర్లు వడ్డీల మీద వడ్డీలు వేస్తుండడంతో అప్పు భారంగా మారుతోందని రైతుల్లో ఆందోళన వ్యక్తమవుతోంది. ఈ బడ్జెట్‌లోనైనా ప్రభుత్వం రుణమాఫీపై స్పష్టత ఇస్తుందని రైతులు గంపెడాశలు పెట్టుకున్నారు.

రూ.3 లక్షల కోసం ఎదురుచూపు

డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల పథకం నియోజకవర్గాల్లోని అర్హుల దరికి చేరలేదు. కొన్ని చోట్ల నిర్మాణం పూర్తయినా లబ్ధిదారులు కేటాయించలేదు. ఇంతలోనే ప్రభుత్వం సొంత స్థలం ఉన్న నిరుపేదలకు ఇంటి నిర్మాణానికి రూ.3 లక్షలు ఇస్తామని ప్రకటించింది. ఈ నేపథ్యాన జిల్లాలో సొంత జాగా ఉన్న నిరుపేదలు ఈ బడ్జెట్‌లో నిధుల కేటాయింపుపై ఆశగా ఎదురుచూస్తున్నారు.

నిధులు కావాలి..

జిల్లాలోని మిగతా నియోజకవర్గాలతో పోలిస్తే వైరా నియోజకవర్గంలో అంతర్గత రోడ్లు అధ్వానంగా ఉన్నాయి. ఈ రోడ్ల నిర్మాణానికి ప్రభుత్వం నిధులు కేటాయించాల్సి ఉంది. అలాగే ముఖ్యమంత్రి ఇటీవల జిల్లా పర్యటన సందర్భంగా ప్రభుత్వ ఇంజనీరింగ్ కళాశాల ఏర్పాటు చేయనున్నట్లు హామీ ఇచ్చారు. దీనికి ఈ బడ్జెట్‌లో నిధుల కేటాయింపు ఉంటుందనే ఆశాభావం వ్యక్తమవుతోంది. అలాగే నూతన గ్రామపంచాయతీల భవన నిర్మాణాలు, సీసీ రోడ్లు, డ్రెయినేజీలకు నిధుల కోసం సర్పంచ్‌లు డిమాండ్ చేస్తున్నారు. బడ్జెట్‌లో ఈ నిధులు వస్తే గ్రామపంచాయతీల్లో మరింత అభివృద్ధి జరిగేందుకు ఆస్కారముంది.

అన్ని రంగాల్లో అభివృద్ధి



ఉమ్మడి జిల్లా అన్ని రంగాల్లో అభివృద్ధి చెందుతోంది. రెండు జిల్లాల్లో కొత్త కలెక్టరేట్లు ప్రారంభించగా, మెడికల్ కాలేజీలు మంజూరయ్యాయి. ఈ బడ్జెట్‌లోనూ ముఖ్యమంత్రి కేసీఆర్ నేతృత్వాన అన్నిరంగాలకు ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తారనే నమ్మకముంది.

–పువ్వాడ అజయ్‌కుమార్, రాష్ట్ర రవాణా శాఖ మంత్రి

సమస్యలు ప్రస్తావిస్తా..



జిల్లాలో పోడుభూముల సమస్య పరిష్కారం కాలేదు. సీతారామ ప్రాజెక్టుకు నిధులు చాలక పనులు సాగడం లేదు. అలాగే రుణమాఫీ పూర్తికాక పోవడంతో రైతులు ఇబ్బందుల్లో ఉన్నారు. వీటితో పాటు ధరణి సమస్యల పరిష్కారం కోసం అసెంబ్లీలో ప్రస్తావిస్తా.

– మల్లు భట్టి విక్రమార్క, సీఎల్పీ నేత

నిధులు కోరతాం..



వైరాలో 100 పడకల ఆస్పత్రిని నిర్మించాల్సి ఉంది. అలాగే సీతారామ ప్రాజెక్టు పనులు త్వరగా పూర్తి కావాలి. ఇవేకాక ఇంకా వైరా మున్సిపాలిటీకి నిధులు అడుగుతాం. దళితబంధు, ఇళ్ల నిర్మాణం తదితర పనులకు ప్రతిపాదనలను సీఎం కేసీఆర్ దృష్టికి తీసుకెళ్తా.

– లావుడ్యా రాములునాయక్, ఎమ్మెల్యే, వైరా

రోడ్లకు నిధులు అడుగుతాం..



నియోజకవర్గంలో రోడ్ల నిర్మాణానికి సంబంధించి నిధులను కోరుతాం. పేదలకు ఇళ్ల నిర్మాణానికి నిధులు కేటాయింపును ప్రస్తావిస్తా. నియోజకవర్గానికి ఇప్పటికే నర్సింగ్ కళాశాల మంజూరైంది. ఇందు కోసం నిధులే కాక మరింత అభివృద్ధి కోసం నిధులు కోరతాం.

– కందాల ఉపేందర్‌రెడ్డి, ఎమ్మెల్యే, పాలేరు

మరిన్ని నిధులు కోరుతా...



నియోజకవర్గవ్యాప్తంగా పాఠశాలలు, జీపీల భవనాలు, అంతర్గత రోడ్ల నిర్మాణం పూర్తయింది. సత్తుపల్లి మున్సిపాలిటీతో పాటు మేజర్ పంచాయతీలకు మరింత అభివృద్ధి చేసేలా ప్రతిపాదనలు చేశాం. ఆయా పనులకు నిధులు కేటాయించాలని కోరుతా.

– సండ్ర వెంకటవీరయ్య, ఎమ్మెల్యే, సత్తుపల్లి

అధునాతనం.. అన్నీ ఒకేచోట!



ఖమ్మం వీడీవోస్ కాలనీలో సిద్ధమవుతున్న సమీకృత మార్కెట్

- ఖమ్మంలో నిర్మాణం పూర్తికావొస్తున్న సమీకృత మార్కెట్
- 2.01 ఎకరాల్లో రూ.4.50 కోట్లతో నిర్మాణం
- త్వరలో ప్రారంభించనున్న మంత్రి కేటీఆర్



ప్రహరీపై వేసిన చిత్రాలు

ఖమ్మంమయూరిసెంటర్: మహా నగరాలకు దీటుగా ఖమ్మం నగరంలో అధునాతన వసతులతో సమీకృత మార్కెట్లు నిర్మాణమవుతున్నాయి. ఇప్పటికే వీధి వ్యాపారుల ప్రాంగణాలు, రైతుబజార్లు, సమీకృత వెజ్ అండ్ నాన్‌వెజ్ మార్కెట్లు అందుబాటులో రాగా, మరో సమీకృత మార్కెట్ సిద్ధమవుతోంది. ప్రజలకు ఉపయోగపడేలా సువిశాల స్థలంలో కూరగాయలు, పండ్లు, మాంసాహారం, చేపలు, నిత్యావసరాలు అన్నీ ఒకేచోట లభించేలా నిర్మిస్తున్న మార్కెట్ పనులు చివరి దశకు చేరాయి. రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ ప్రత్యేక చొరవతో ఇక్కడ సమీకృత మార్కెట్‌ను నిర్మిస్తుండగా, త్వరలోనే మంత్రి కేటీఆర్ చేతుల మీదుగా ప్రారంభానికి సన్నాహాలు చేస్తున్నారు.

ఆకర్షణీయంగా..

సమీకృత వెజ్ అండ్ నాన్‌వెజ్ మార్కెట్‌ను అటు వ్యాపారులు, ఇటు ప్రజలకు సౌకర్యంగా తీర్చిదిద్దుతున్నారు. బయటి నుంచి చూస్తే కార్పొరేట్ మాల్స్‌ను తలదన్నేలా ఉండగా, ఆవరణలోని స్టాళ్లు కూడా టైల్స్, ఇతర సౌకర్యాలతో ఏర్పాటుచేశారు. ఇక లోపల, ఆవరణలోని ప్రహరీలపై పండ్ల బొమ్మలు, వ్యాపారుల చిత్రాలను వేయడంతో కొత్త అందం సంతరించుకుంది. కాగా, షెడ్లనిర్మాణం, పార్కింగ్, నీటి వసతి, విద్యుత్ తదితర సౌకర్యాలు ఇప్పటికే సమకూర్చారు.

134 స్టాళ్లు

ఖమ్మం వీడీఓస్ కాలనీలో 2.01 ఎకరాల్లో సువిశాలమైన ప్రాంగణంలో సమీకృత వెజ్ అండ్ నాన్‌వెజ్ మార్కెట్ నిర్మిస్తున్నారు. రూ.4.50 కోట్ల వ్యయంతో ఈనిర్మాణం చేపట్టగా, 134 మంది వ్యాపారులకు స్టాళ్లు కేటాయిస్తారు. ఇందులో 65 కూరగాయలు, 23 పండ్లు, 46 మాంసాహారం స్టాళ్లను వ్యాపారులకు కేటాయించనున్నారు. హైదరాబాద్ తర్వాత ఖమ్మంలోనే ఇలా అన్నీ ఒక చోట లభించేలా సమీకృత మార్కెట్ నిర్మిస్తున్నట్లు చెబుతుండగా.. మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ ఎప్పటికప్పుడు పరిశీలిస్తూ పనులు త్వరగా పూర్తయ్యేలా సూచనలు చేస్తున్నారు.



సమీకృత మార్కెట్‌లోని స్టాళ్లు

రామయ్య హుండీ ఆదాయం రూ.2.20 కోట్లు

భద్రాచలం: భద్రాచలం శ్రీ సీతారామచంద్రస్వామి దేవస్థానంలో గురువారం హుండీలను లెక్కించారు. 84 రోజులకు గాను రూ. 2,20,91,906 ఆదాయం సమకూరింది. దీంతోపాటు 250 గ్రాముల బంగారం, రెండు కేజీల వెండి వస్తువులను భక్తులు కానుకల రూపంలో సమర్పించారు. ఇంకా 499 యూఎస్ డాలర్లు, 55 కెనడా డాలర్లు, 85 సింగపూర్ డాలర్లు, 180 ఆస్ట్రేలియా డాలర్లు, 200 ఒమన్ బైసాలతో పాటు ఇతర విదేశీ మారక ద్రవ్యాన్ని సైతం భక్తులు స్వామివారికి సమర్పించారు. రాష్ట్రపతి పర్యటన నేపథ్యంలో ఆలస్యమైన హుండీల లెక్కింపు ముక్కోటి ఉత్సవాల అనంతరం చేపట్టడంతో భారీగా ఆదాయం సమకూరింది. అనంతరం హుండీ ఆదాయాన్ని బ్యాంకు అధికారులకు అందజేశారు. కార్యక్రమంలో ఆలయ ఈఓ శివాజీ తదితరులు పాల్గొన్నారు.



కానుకలు లెక్కిస్తున్న భక్తులు, ఆలయ సిబ్బంది

షెడ్యూల్ ప్రకారం 'కంటి వెలుగు'

వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ గౌతమ్

ఖమ్మం సహకారనగర్: షెడ్యూల్ ప్రకారం జిల్లాలో కంటి వెలుగు శిబిరాలు నిర్వహించాలని కలెక్టర్ వీ.పీ.గౌతమ్ ఆదేశించారు. కలెక్టరేట్ నుంచి గురువారం ఆయన వీడియో కాన్ఫరెన్స్ ద్వారా వైద్యాధికారులు, పంచాయతీరాజ్ ఇంజనీర్లు, ఎంపీడీఓలు, తహసీల్దార్లతో కంటివెలుగు, సబ్ సెంటర్ల భవన నిర్మాణాలు, పీహెచ్‌సీల మరమ్మతులపై సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో బుధవారం వరకు 69,724 మందికి కంటిపరీక్షలు చేసి, 19,043 మందికి రీడింగ్ అద్దాలు పంపిణీ చేసినట్లు తెలిపారు. శిబిరాలకు ఎక్కువ మంది ప్రజలు వచ్చేలా అవగాహన కల్పించడమే కాక పరీక్షలు చేయాలని సూచించారు. కాగా, 47 సబ్ సెంటర్లకు భవనాలు మంజూరైనందున రెండు వారాల్లోగా గ్రౌండింగ్ చేయాలని తెలిపారు. పీహెచ్‌సీల మరమ్మతు పనుల్లో వేగం పెంచడంపై వైద్యాధికారులు దృష్టి సారించాలని సూచించారు. ఇక జిల్లాలోని 328మంది ఏఎన్ఎంల్లో కార్యస్థానాల్లో 109మంది, మండల కేంద్రాల్లో 108 మంది నివాసముంటుండగా మిగతా వారు ఇతర ప్రాంతాల నుంచి రాకపోకలు సాగిస్తున్నారని కలెక్టర్ తెలిపారు. ఇకనైనా వారు విధినిర్వహణ ప్రాంతంలోనే నివాసం ఉండకపోతే చర్యలు తప్పవని హెచ్చరించారు. వీసీలో డీఎంహెచ్ఓ డాక్టర్ బి.మాలతి, పీఆర్ ఈఈలు కేవీకే.శ్రీనివాస్, చంద్రమౌళి, ప్రోగ్రాం అధికారులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కలెక్టర్ గౌతమ్, పక్కన డీఎంహెచ్ఓ మాలతి, అధికారులు

రయ్‌రయ్.. గ్రీన్‌ఫీల్డ్ హైవే

- చురుగ్గా కొనసాగుతున్న ఖమ్మం–దేవరపల్లి రహదారి పనులు
- ఇప్పటికే భూసేకరణ, నాణ్యతా పరీక్షలు పూర్తి
- మొత్తం ఐదు ప్యాకేజీల్లో జిల్లాలో మూడు...
- ఎగ్జిట్లు ఇవ్వాలంటూ పలు గ్రామాల ప్రజల వినతి



వేంసూరు మండలం లింగపాలెం వద్ద జాతీయ రహదారి నిర్మాణానికి చదును చూసిన భూమి (ఇన్‌సెట్) నిర్మాణ ప్రదేశంలో మట్టి పరీక్షలు నిర్వహిస్తున్న అధికారులు

సత్తుపల్లి: జిల్లా మీదుగా ఏపీలోని దేవరపల్లి వరకు నిర్మించే గ్రీన్‌ఫీల్డ్ హైవే పనులు శరవేగంగా సాగుతున్నాయి. 162.126 కిలోమీటర్ల మేర నిర్మించే ఈ రహదారికి 365 బీజీ నంబర్ కేటాయించారు. మొత్తం రూ.3,352.96 కోట్లతో చేపట్టే జాతీయ రహదారిని ఐదు ప్యాకేజీలుగా విభజించి పనులను చేపట్టారు. ఇందులో మూడు ప్యాకేజీలు జిల్లాలో ఉండగా, మిగతావి ఏపీలో ఉంటాయి. కాగా, జాతీయ రహదారికి సంబంధించి పలుచోట్ల ఎగ్జిట్లు (రాకపోకలకు మార్గం) ఇవ్వాలని ప్రతిపాదించగా మరికొన్ని చోట్ల గ్రామస్తుల నుంచి డిమాండ్లు వెల్లువెత్తుతున్నాయి.

ప్యాకేజీలు ఇలా...

జాతీయ రహదారిలోని మొదటి 33.06 కిలోమీటర్ల మేర జిల్లాలోని తల్లంపాడు నుంచి వైరా మండలం సోమవరం వరకు ఉంటుంది. ఇక రెండో ప్యాకేజీ 33.65 కిలోమీటర్ల మేర సోమవరం నుంచి పెనుబల్లి మండలం చింతగూడెం వరకు నిర్మిస్తారు. ఆతర్వాత మూడో ప్యాకేజీని 42.119 కిలోమీటర్లుగా చింతగూడెం నుంచి ఏపీలోని చింతలపూడి మండలం రేచర్ల వరకు నిర్మించనున్నారు. కాగా, నాలుగో ప్యాకేజీ 27.428 కిలోమీటర్లు రేచర్ల నుంచి గురవాయిగూడెం వరకు, ఐదో ప్యాకేజీ 29.46 కిలోమీటర్ల మేర గురవాయిగూడెం – దేవరపల్లి లింక్ వరకు నిర్మించనున్నారు. కాగా, 1, 2, 3 ప్యాకేజీల పనులు ఖమ్మం నుంచి తుంబూరు వరకు 89.875 కిలోమీటర్ల మేర సాగనున్నాయి.

ఐదు ఎగ్జిట్లు

ఖమ్మం–దేవరపల్లి జాతీయ రహదారిలో రాకపోకలకు అనువుగా ఐదు ఎగ్జిట్లు నిర్ణయించారు. ఖమ్మం, సోమవరం(వైరా మండలం), సీతారామపురం(పెనుబల్లి మండలం), రేచర్ల(చింతలపూడి మండలం), హైవే లింక్(దేవరపల్లి) వద్ద ఇవి ఏర్పాటవుతాయి. అలాగే, భారీ వాహనాలు వెళ్లేందుకు ఐదు చోట్ల, చిన్న వాహనాలు రాకపోకలు సాగించేలా మరో 11చోట్ల అండర్ పాస్‌లు నిర్మిస్తారు. ఎక్కడ కూడా ట్రాఫిక్‌కు అంతరాయం కలగకుండా రోడ్డు ఎత్తు పెంచుతూ అండర్‌పాస్‌ల నిర్మాణం చేపడుతారు.

సత్తుపల్లి–లింగపాలెం వద్ద ఎగ్జిట్ ఇవ్వాల్సిందే..

సత్తుపల్లి, అశ్వారావుపేట నియోజకవర్గాల నుంచి వచ్చే వాహనాల కోసం సత్తుపల్లి–విజయవాడ రాష్ట్రీయ రహదారిలోని లింగపాలెం వద్ద ఎగ్జిట్ ఇవ్వాలని స్థానికులు పట్టుపడుతున్నారు. సత్తుపల్లి నియోజకవర్గ కేంద్రం కావడం.. ఈ ప్రాంతం నుంచి ఎక్కువగా హైదరాబాద్, విశాఖపట్నం వెళ్లే ప్రయాణికులు ఉన్నందున ఇక్కడ ఎగ్జిట్ ఇస్తే అందరికీ ఉపయోగకరంగా ఉంటుందని చెబుతున్నారు. ఈమేరకు జాతీయ రహదారుల అథారిటీ అధికారులకు ఇప్పటికే వినతిపత్రాలు అందజేశారు. ఎగ్జిట్ ఇవ్వకపోతే పెనుబల్లి మండలం చింతగూడెం వరకు వెళ్లాల్సి రావటం దూరాభారం అవుతుందని, ఈ ప్రాంత ప్రజల అవసరాలను పరిగణనలోకి తీసుకోవాలని కోరుతున్నారు.

జాతీయ రహదారి డిజైన్ ఇలా

ఖమ్మం–దేవరపల్లి జాతీయ రహదారిని నాలుగు లేన్లుగా నిర్మించనున్నారు. కానీ భవిష్యత్‌లో ఆరు లేన్లుగా విస్తరించినా ఇబ్బంది ఎదురుకాకుండా ఆమేరకు భూసేకరణ పూర్తిచేశారు. మధ్యలో నాలుగు మీటర్ల డివైడర్, ఇరువైపులా 12.5 మీటర్ల వెడల్పుతో బీటీ రోడ్డు నిర్మిస్తారు. ఇది పోగా, రెండు పక్కలా కలిపి మిగిలే 31మీటర్ల భూమిలో మొక్కలు నాటి పచ్చదనం కళకళలాడేలా తీర్చిదిద్దనున్నారు. అలాగే, వాహనాలు వేగంగా వెళ్లేందుకు వీలుగా, రోడ్డుపైకి పశువులు, ప్రజలు రాకుండా ఇరువైపులా 15 మీటర్ల ఎత్తుతో ఫెన్సింగ్ ఏర్పాటు చేస్తారు. ఇక జాతీయ రహదారి నిబంధనల ప్రకారం 60 కిలోమీటర్లకు ఒకటి చొప్పున టోల్‌గేట్లు ఏర్పాటవుతాయి. మొత్తంగా ఖమ్మం నుంచి దేవరపల్లి వరకు కనీసం మూడు టోల్‌గేట్లు ఏర్పాటుచేసే అవకాశముందని సమాచారం.

ఇప్పటికే తీర్మానాలు చేశాం..



జాతీయ రహదారిపై సత్తుపల్లి–లింగపాలెం వద్ద ఎగ్జిట్ ఇవ్వాలని సర్పంచ్‌లం తీర్మానించాం. జాతీయ రహదారి మా ప్రాంతం మీదుగా నిర్మిస్తూ, మమ్మల్ని దూరంగా వెళ్లాలని చెప్పడం సరికాదు. సత్తుపల్లి–విజయవాడ రహదారిలో కూడా ఎగ్జిట్ ఇవ్వకపోతే ఉద్యమిస్తాం.

– ఎం.డీ.ఫైజుద్దీన్, సర్పంచ్, వేంసూరు

అప్పుడే అభివృద్ధి సాధ్యం



జాతీయ రహదారి వేంసూరు మండలం మీదుగా వెళ్తుండడంతో మా ప్రాంతం అభివృద్ధి చెందుతుందని ఆశించాం. కానీ మా ప్రాంతం వద్ద ఎగ్జిట్ ఇవ్వకపోతే మళ్లీ మారుమూల ప్రాంతంగానే మిగిలిపోతుంది. ఎగ్జిట్ ఇస్తేనే ఈ ప్రాంతంలో అభివృద్ధి వేగంగా జరుగుతుంది.

– మందపాటి రాఘవరెడ్డి, ఎంపీటీసీ, మర్లపాడు

పోలీసు శాఖకు కొత్త ఫోన్ నంబర్లు

- సీపీ మొదలు అన్ని కేడర్ల అధికారులకు కేటాయింపు
- కమిషనరేట్ పరిధిలో 6వ తేదీ నుంచి అమల్లోకి...

ఖమ్మంక్రైం: ఖమ్మం పోలీస్ కమిషనరేట్ పరిధిలోని అధికారులకు కొత్త ఫోన్ నంబర్లు కేటాయించారు. ఈమేరకు పోలీస్ కమిషనర్ విష్ణు ఎస్.వారియర్ గురువారం ఓ ప్రకటన విడుదల చేశారు. ప్రస్తుతం అధికారులు ఉపయోగిస్తున్న నంబర్లు ఈనెల 5వ తేదీ వరకే మనుగడలో ఉంటాయని తెలిపారు. కొత్త నంబర్లు 6వ తేదీ నుంచి అమల్లోకి వస్తాయనే విషయాన్ని ప్రజలు గమనించాలని సీపీ సూచించారు.

కొత్త నంబర్లు ఇవే...

సీపీ కార్యాలయం	87126 59260
సీపీ క్యాంప్ ఆఫీస్	87126 59246
పీసీ టూ సీపీ	87126 59245
కమిషనరేట్ పీఆర్ఓ	87126 59256
ఏసీపీ ఖమ్మం టౌన్	87126 59105
ఎస్‌హెచ్‌ఓ, ఖమ్మం వన్ టౌన్	87126 59106
పీఎస్, ఖమ్మం వన్‌టౌన్	87126 59107
ఎస్‌హెచ్‌ఓ, ఖమ్మం టూటౌన్	87126 59110
పీఎస్, ఖమ్మం టూటౌన్	87126 59112
ఎస్‌హెచ్‌ఓ ఖమ్మం త్రీటౌన్	87126 59115
పీఎస్, ఖమ్మం త్రీటౌన్	87126 59116
ఎస్‌హెచ్‌ఓ, ఖానాపురం హవేలీ	87126 59119
పీఎస్, ఖానాపురం హవేలీ	87126 59120
ఏసీపీ, ఖమ్మం రూరల్	87126 59124
సీఐ, ఖమ్మం రూరల్	87126 59125
ఎస్‌హెచ్‌ఓ, ఖమ్మంరూరల్	87126 59126
పీఎస్, ఖమ్మం రూరల్	87126 59127
ఎస్‌హెచ్‌ఓ, ముదిగొండ	87126 59129
పీఎస్, ముదిగొండ	87126 59130
సీఐ, కూసుమంచి	87126 59132
ఎస్‌హెచ్‌ఓ, కూసుమంచి	87126 59133
పీఎస్, కూసుమంచి	87126 59134
ఎస్‌హెచ్‌ఓ, తిరుమలాయపాలెం	87126 59136
పీఎస్, తిరుమలాయపాలెం	87126 59137
ఎస్‌హెచ్‌ఓ, నేలకొండపల్లి	87126 59138
పీఎస్, నేలకొండపల్లి	87126 59139
సీఐ, సింగరేణి	87126 59140
ఎస్‌హెచ్‌ఓ, కారేపల్లి	87126 59141
పీఎస్, కారేపల్లి	87126 59143
ఎస్‌హెచ్‌ఓ, కామేపల్లి	87126 59144
పీఎస్, కామేపల్లి	87126 59145
ఎస్‌హెచ్‌ఓ, రఘునాథపాలెం	87126 59217
పీఎస్, రఘునాథపాలెం	87126 59218
ఏసీపీ, వైరా	87126 59146
సీఐ, వైరా	87126 59147
ఎస్‌హెచ్‌ఓ, వైరా	87126 59148
పీఎస్, వైరా	87126 59149
ఎస్‌హెచ్‌ఓ, కొణిజర్ల	87126 59150
పీఎస్, కొణిజర్ల	87126 59151
ఎస్‌హెచ్‌ఓ, చింతకాని	87126 59152
పీఎస్, చింతకాని	87126 59153
ఎస్‌హెచ్‌వో తల్లాడ	87126 59154
పీఎస్, తల్లాడ	87126 59155
ఎస్‌హెచ్‌వో, బోనకల్	87126 59156
పీఎస్, బోనకల్	87126 59157
సీఐ, మధిర	87126 59158
ఎస్‌హెచ్‌ఓ, మధిర టౌన్	87126 59159
పీఎస్, మధిర టౌన్	87126 59160
ఎస్‌హెచ్‌ఓ, మధిర రూరల్	87126 59162
పీఎస్ మధిర రూరల్	87126 59163
ఎస్‌హెచ్‌ఓ, ఎర్రుపాలెం	87126 59164
పీఎస్, ఎర్రుపాలెం	87126 59165
ఏసీపీ, కల్లూరు	87126 59166
ఎస్‌హెచ్‌ఓ, సత్తుపల్లి	87126 59167
పీఎస్, సత్తుపల్లి	87126 59168
ఎస్‌హెచ్‌ఓ, కల్లూరు	87126 59171
పీఎస్, కల్లూరు	87126 59172
ఎస్‌హెచ్‌ఓ, వేంసూరు	87126 59174
పీఎస్, వేంసూరు	87126 59175
ఎస్‌హెచ్‌ఓ, వీ.ఎం.బంజర	87126 59176
పీఎస్, వీ.ఎం.బంజర	87126 59177
ఎస్‌హెచ్‌ఓ, ఏన్కూరు	87126 59178
పీఎస్, ఏన్కూరు	87126 59179
ఏసీపీ, టాస్క్‌ఫోర్స్	87126 59180
ఏసీపీ, సీసీఎస్, ఖమ్మం	87126 59185
డబ్ల్యూపీఎస్, ఇన్‌స్పెక్టర్	87126 59196
డబ్ల్యూపీఎస్, ఖమ్మం	87126 59197
ఏసీబీ, సీఎస్‌బీ, ఖమ్మం	87126 59200
ఏసీపీ, ట్రాఫిక్, ఖమ్మం	87126 59209
ఇన్‌స్పెక్టర్–1	87126 59210
ఇన్‌స్పెక్టర్–2	87126 59211
పీఎస్, ట్రాఫిక్, ఖమ్మం	87126 59212
సైబర్‌సెల్, ఖమ్మం	87126 59219
సీఐ, కమాండ్ కంట్రోల్	87126 59228
కమాండ్ కంట్రోల్–1	87126 59111
ఉమెన్ సేఫ్టీ వింగ్	
కమాండ్ కంట్రోల్–1	87126 59222

ఖమ్మం మార్కెట్ ధరలు

(క్వింటాకు రూ.లలో)

	గరిష్ట	కనిష్ట
పెసలు	7,200	7,200
కందులు	6,700	6,700
పత్తి	7,750	5,500
ఏసీ మిర్చి	18,200	12,000
తాలు మిర్చి	10,000	7,500

– ఖమ్మం వ్యవసాయం

పామాయిల్ గెలలు

టన్ను ధర	రూ.13,881

ఫైనల్స్‌లో కేఎండీసీ, ఎస్ఆర్అండ్‌బీజీఎన్ఆర్

- తుది దశకు చేరిన 'సాక్షి'ప్రీమియర్ లీగ్
- ఉత్కంఠగా సాగిన సెమీ ఫైనల్ మ్యాచ్‌లు



ఫైనల్స్‌కు చేరిన ఎస్ఆర్అండ్‌బీజీఎన్ఆర్ కళాశాల జట్టు



క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న 'సాక్షి'బ్యూరో ఇన్‌చార్జ్ బొల్లం శ్రీనివాస్, బీఎం మోహన్‌కృష్ణ, టీవీ ప్రతినిధి మహేందర్‌కుమార్

SAKSHI SAKSHI DIGITAL

ఖమ్మం స్పోర్ట్స్: 'సాక్షి 'మీడియా గ్రూప్ ఆధ్వర్యాన సుధాకర్ పైప్స్ అండ్ ఫిట్టింగ్ సౌజన్యంతో జరుగుతున్న 'సాక్షి'ప్రీమియర్ లీగ్(ఎస్‌పీఎల్) క్రికెట్ పోటీలు తుది అంకానికి చేరాయి. ఖమ్మం ఎస్ఆర్అండ్‌బీజీఎన్ఆర్ కళాశాల మైదానంలో పోటీలు జరుగుతుండగా, గురువారం జరిగిన క్వార్టర్ ఫైనల్స్, సెమీస్ మ్యాచ్‌లను 'సాక్షి'బ్రాంచ్ మేనేజర్ గుడిమెట్ల మోహనకృష్ణ, బ్యూరో ఇన్‌చార్జ్ బొల్లం శ్రీనివాస్, టీవీ ప్రతినిధి పి.మహేందర్ ప్రారంభించారు. ఇంకా ఈ కార్యక్రమంలో ఈవెంట్ మేనేజర్ బోడపట్ల వేణు, ఆర్సీ ఇన్‌చార్జ్ నెల్లూరి ఉపేందర్, ఎస్ఆర్అండ్‌బీజీఎన్ఆర్ కళాశాల పీడీ డాక్టర్ బి.వెంకన్నతో పాటు జుజ్జూరు ఉపేందర్, గుడిసె రాంబాబు తదితరులు పాల్గొన్నారు. ఈమేరకు సీనియర్స్ విభాగంలో సెమీస్‌లో గెలుపొందిన కవిత మెమోరియల్ డిగ్రీ కళాశాల, ఎస్ఆర్అండ్‌బీజీఎన్ జట్లు ఫైనల్స్‌కు చేరాయి. ఇక జూనియర్స్ విభాగంలో శ్రీచైతన్య జూనియర్ కళాశాల(ఖమ్మం) – బొమ్మ డిప్లామా కళాశాల(ఖమ్మం) జట్లు ఇప్పటికే ఫైనల్స్‌కు చేరగా... రెండు విభాగాల్లో ఫైనల్స్ పోటీలను శుక్రవారం నిర్వహించనున్నారు.

సెమీ ఫైనల్స్‌లో...

- మొదటి సెమీ ఫైనల్ మ్యాచ్‌లో కవిత మెమోరియల్ డిగ్రీ, పీజీ కళాశాల(ఖమ్మం) – మదర్‌థెరిస్సా ఇంజనీరింగ్ కళాశాల(సత్తుపల్లి) జట్లు తలపడగా బ్యాటింగ్ ఎంచుకున్న మదర్‌థెరిస్సా జట్టు 74 పరుగులు చేయగా, ఈ జట్టులో శివ 29 పరుగులు సాధించాడు. ఆతర్వాత బ్యాటింగ్‌కు దిగిన కవిత కాలేజీ జట్టు 77 పరుగులు చేయడంతో విజయం సాధించి ఫైనల్స్‌లోకి దూసుకెళ్లింది. ఈ జట్టులో నాగూల్ మీరా ఒక ఫోర్, ఒక సిక్సర్ సాయంతో 23 పరుగులు, దేవాన్ 12, ఫరీద్ 12 పరుగులు చేశారు.

రెండో సెమీస్‌లో...

SPL SAKSHI PREMIER LEAGUE

ఎస్‌బీఐటీ–1(ఖమ్మం) – ఎస్ఆర్అండ్‌బీజీఎన్ఆర్ కళాశాల(ఖమ్మం) జట్లు తలపడగా తొలుత బ్యాటింగ్ ఎంచుకున్న ఎస్‌బీఐటీ జట్టు పరిమిత ఓవర్లలో 69 పరుగులు చేసింది. ఈ జట్టులో హర్ష 18, కల్యాణ్ 12 పరుగులు చేశారు. ఆతర్వాత బ్యాటింగ్‌కు దిగిన ఎస్ఆర్అండ్‌బీజీఎన్ఆర్ జట్టు 70 పరుగులు సునాయాసంగా చేసి ఫైనల్స్‌కు చేరింది. ఈ జట్టులో బన్నీ మూడు ఫోర్లు ఒక సిక్సర్‌తో 28, విశాల్ రెండు సిక్స్‌లు కలిపి 15 పరుగులు చేశారు.

క్వార్టర్ ఫైనల్స్ ఫలితాలు ఇలా...

- ఉదయం జరిగిన రెండో క్వార్టర్ ఫైనల్స్‌లో మదర్‌థెరిస్సా ఇంజనీరింగ్ కళాశాల(సత్తుపల్లి) – బొమ్మ ఇంజనీరింగ్ కళాశాల(ఖమ్మం) జట్లు తలపడగా టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న బొమ్మ కళాశాల జట్టు 67 పరుగులు చేసింది. ఈ జట్టులో మహేష్ 24, ఉదయ్ 16 పరుగులు చేశారు. ఆతర్వాత మదర్ థెరిస్సా జట్టు 68 పరుగులు చేయగా సెమీస్‌కు ప్రవేశించింది. ఈ జట్టులో కేశవ్ మూడు ఫోర్లు, ఒక సిక్సర్‌తో 36 పరుగులు, ప్రవీణ్ 14 పరుగులు చేశాడు.
- ఎస్ఆర్అండ్‌బీజీఎన్ఆర్ కళాశాల(ఖమ్మం) – వికాస్ డిగ్రీ కళాశాల(ఖమ్మం) జట్ల నడుమ మ్యాచ్‌లో బ్యాటింగ్ ఎంచుకున్న ఎస్ఆర్అండ్‌బీజీఎన్ఆర్ జట్టు 132 పరుగుల భారీ స్కోరు చేసింది. ఈ జట్టులో విశాల్ యాదవ్ 8ఫోర్లు, రెండు సిక్సర్లతో 53 పరుగులు, బన్నీ 5ఫోర్లు, 5 సిక్స్‌లతో 64 రన్స్ చేయడం విశేషం. ఆతర్వాత బ్యాటింగ్ చేసిన వికాస్ డిగ్రీ కళాశాల జట్టు కేవలం 46 పరుగులు చేయడంతో ఓటమి పాలైంది.
- కవిత మెమోరియల్ డిగ్రీ, పీజీ కళాశాల(ఖమ్మం) – విజయ ఇంజనీరింగ్ కళాశాల(కొణిజర్ల) జట్ల మధ్య మ్యాచ్‌లో తొలుత బ్యాటింగ్ చేసిన కవిత కాలేజీ జట్టు ఓవర్లలో 85 పరుగులు చేయగా, ఫరీద్ మూడు సిక్స్‌లు, నాలుగు ఫోర్లతో 46 పరుగులు, నాగుల్‌మీరా 16 పరుగులు చేశారు. ఆతర్వాత బ్యాటింగ్‌కు దిగిన విజయ ఇంజనీరింగ్ కళాశాల జట్టు 55 పరుగులే చేయగలిగింది. ఈ జట్టులో భాను రెండు ఫోర్లు, రెండు సిక్సర్లతో 30 పరుగులు చేశాడు.



ఫైనల్‌కు చేరిన కవిత మెమోరియల్ డిగ్రీ కళాశాల జట్టు



క్వార్టర్ ఫైనల్స్‌లో హాఫ్ సెంచరీలు చేసిన ఎస్ఆర్అండ్‌బీజీఎన్ఆర్ బ్యాట్స్‌మెన్లు విశాల్, బన్నీ

SUDHAKAR PIPES AND FITTINGS
LEADER IN QUALITY AND TECHNOLOGY
Regional Sponser

ఫరీద్.. హ్యాట్రిక్



క్వార్టర్ ఫైనల్స్ మ్యాచ్‌లో కవిత మెమోరియల్ డిగ్రీ, పీజీ కళాశాల జట్టు ఆల్ రౌండర్ ఫరీద్ విజయ ఇంజనీరింగ్ కళాశాలపై వరుసగా మూడు వికెట్లు తీసుకుని హ్యాట్రిక్ సాధించాడు. అంతేకాక మరో వికెట్ కూడా తీసుకున్నాడు. ఇక బ్యాటింగ్‌లోనూ నాలుగు ఫోర్లు, మూడు సిక్సర్లతో 46 పరుగుల వ్యక్తిగత స్కోరు సాధించాడు. ఈసందర్భంగా ఫరీద్ మాట్లాడుతూ ఇప్పటికే యూనివర్సిటీ జట్టు ప్రాబబుల్స్‌కు ఎంపిక కాగా, కేయూ జట్టులో స్థానం సాధించడమే తన లక్ష్యమని తెలిపాడు.

సాగర్ కాల్వలో రైతుల గల్లంతు

- సాగునీటి కోసం సైఫన్లు ఏర్పాటు చేస్తుండగా ఘటన
- రాత్రి పొద్దుపోయాక లభించిన ఇద్దరి మృతదేహాలు
- కన్నీరుమున్నీరుగా విలపిస్తున్న రైతుల కుటుంబాలు

కల్లూరురూరల్: కళ్ల ముందు ఎదుగుతున్న పంటలను కాపాడుకునేందుకు నీరు పారించాలని భావించినా ఆ రైతుల ఆశలు గల్లంతయ్యాయి. నాగార్జునసాగర్ ప్రధాన కాల్వకు సైఫన్లు ఏర్పాటు చేసే క్రమంలో ఇద్దరు రైతులు జారిపడి నీటి ప్రవాహంలో కొట్టుకుపోయారు. కల్లూరు మండలం కప్పలబంధం వద్ద గురువారం సాయంత్రం నాగార్జున సాగర్ ప్రధాన కాల్వ వద్ద ఈ ఘటన చోటు చేసుకుంది. కాల్వలో నీటి ఉధృతి ఎక్కువగా ఉండడంతో గాలింపు కష్టంగా మారగా... రాత్రి పొద్దుపోయాక 9గంటల ప్రాంతాన రైతులు గల్లంతైన చోటకు కొద్దిదూరంలో ఇద్దరి మృతదేహాలు లభ్యమయ్యాయి. దీంతో రైతుల కుటుంబీకుల రోదనలు మిన్నంటాయి.

వరి పంటకు నీటి కోసం...

మండలంలోని కప్పలబంధం గ్రామానికి చెందిన రైతులు లక్కిరెడ్డి చిన్న రామిరెడ్డి (45), గుర్రాల లక్ష్మారెడ్డి(54) పొలాలు సాగర్ కాల్వ సమీపాన ఉన్నాయి. వీరిద్దరు వరి సాగు చేస్తుండగా, సమీపంలోని ఊర చెరువులో నీరు ఇంకిపోయింది. దీంతో స్థానిక రైతులు ఎక్కువమంది యాసంగిలో సైఫన్ల ద్వారా పంటలకు కాల్వ నీరు పారించుకుంటారు. ఇందులో భాగంగానే గురువారం సాయంత్రం లక్కిరెడ్డి చిన్నరామిరెడ్డి, గుర్రాల లక్ష్మారెడ్డి తమ పొలాలకు నీరు పెట్టేందుకు గాను కాల్వలోకి దిగి సైఫన్ల ట్యూబ్‌ల్లో నీరు నింపుతున్నారు. కాల్వ గట్టుపై కృష్ణారెడ్డి తాడు పట్టుకుని రక్షణగా ఉన్నాడు. ఈ క్రమంలో చిన్ని రామిరెడ్డి కాల్వ కట్టకు కొద్ది దిగువన ఉండగా, లక్ష్మారెడ్డి అంతకు కింది భాగంలో తాడు పట్టుకుని ఉన్నారు. అయితే, సైఫన్లలో బిందెతో నీరు పోసే క్రమంలో బిందె జారగా... రామిరెడ్డి చేయి జారి లక్ష్మారెడ్డిపై పడ్డాడు. దీంతో ఇద్దరు నీటిలో పడిపోయారు. ఇద్దరికీ ఈత రాకపోవడంతో మునిగిపోతుండగా కృష్ణారెడ్డి కేకలు వేస్తూ పక్కనే పొలంలో ఉన్న షేక్ పుల్లా సాహెబ్‌ను పిలిచాడు. దీంతో వచ్చిన పుల్లా సాహెబ్ కాల్వలో కొట్టుకుపోతున్న వారిని కాపాడేందుకు దూకినా మునిగిపోయిన రైతులను కాపాడలేక పోయాడు. ఈక్రమంలో పుల్లా సాహెబ్ ఎక్కువ నీరు మింగడంతో ప్రాణాపాయ స్థితిలోకి చేరడంతో స్థానికులు బయటకు తీసి ప్రైవేట్ ఆస్పత్రిలో చేర్పించారు.



కాల్వలో గాలిస్తున్న రైతులు

రాత్రి పొద్దుపోయే వరకు గాలింపు..



లక్కిరెడ్డి రాంరెడ్డి (ఫైల్)



గుర్రాల లక్ష్మారెడ్డి (ఫైల్)



ప్రాణాలతో బయటపడిన పుల్లా సాహెబ్

సాగర్ కాల్వలో నీటి ప్రవాహం ఎక్కువగా ఉండడంతో గల్లంతైన రైతుల కోసం చేపట్టిన గాలింపు కష్టంగా మారింది. ఈమేరకు తహసీల్దార్ బాబ్జీప్రసాద్, పోలీసులు చేరుకోగా.. స్థానిక రైతులు, ఈతగాళ్లు రాత్రి పొద్దుపోయే వరకు గాలింపుల్లో నిమగ్నమయ్యారు. చివరకు సాగర్ ప్రధాన కాల్వకు ఏన్కూరు వద్ద లాక్‌లు వేసి నీటి ఉధృతిని తగ్గించారు. చివరకు రాత్రి 9గంటల ప్రాంతాన రైతులు రామిరెడ్డి, లక్ష్మారెడ్డి మృతదేహాలు లభించాయి. కాగా, చిన్న రామిరెడ్డికి భార్య లక్ష్మి, కుమార్తె, కుమారుడు ఉండగా, లక్ష్మారెడ్డికి భార్య పద్మావతి, కుమారుడు, కుమార్తెలు ఉన్నారు. ఇద్దరు చిన్నకారు రైతులే కాగా, మృతదేహాల వద్ద కుటుంబీకుల రోదించిన తీరు అందరినీ కంటతడి పెట్టించింది.



రోదిస్తున్న రైతుల కుటుంబ సభ్యులు

రహదారి జాప్యం.. వ్యక్తికి శాపం

రాయి తగిలి కన్ను కోల్పోయిన వైనం



కృష్ణమూర్తి

నేలకొండపల్లి: రహదారి నిర్మాణం జాప్యం ... ఓ వ్యక్తికి శాపంగా మారింది. రహదారి నిర్మాణానికి వేసిన కంకర రాయి కంటికి తగలటంతో చూపు కోల్పోయాడు. బాధితుడి కథనం ప్రకారం... నేలకొండపల్లి మండలంలోని సుర్దేపల్లిలో సూర్యాపేట జిల్లా – ఖమ్మం జిల్లాలను కలిపేలా ఐదేళ్ల క్రితం రహదారి మంజూరైంది. సుర్దేపల్లి–పాలారాం మధ్య రహదారి పనులు నేటికీ పూర్తికాకపోవడంతో కంకర కారణంగా తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. ఈక్రమంలోనే రెండు రోజుల క్రితం సుర్దేపల్లికి చెందిన రైతు గడుపూడి కృష్ణమూర్తి పొలం వద్ద ఉండగా, అటుగా వాహనం వెళ్లే క్రమంలో కంకర రాయి వచ్చి ఆయన కంటికి తాకింది. దీంతో ఆయనను ఖమ్మం ఆస్పత్రికి, అక్కడి నుంచి గుంటూరు తరలించగా కనుగుడ్డు మొత్తం పగిలిపోవడంతో ఓ కన్ను చూపు పోయింది. ఆ కన్నుకు గాజు అమర్చాలని చెప్పడంతో ఆర్థిక స్థోమత లేక కృష్ణమూర్తిని ఇంటికి తీసుకొచ్చారు. ఈ విషయమై పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేస్తానని ఆయన తెలిపారు.

రేపు జాబ్ మేళా

ఖమ్మం స్పోర్ట్స్: జిల్లా ఉపాధి కల్పన శాఖ ఆధ్వర్యాన శనివారం జాబ్‌మేళా ఏర్పాటు చేసినట్లు జిల్లా ఉపాధి కల్పన శాఖ అధికారి కొండపల్లి శ్రీరాం ఒక ప్రకటనలో తెలిపారు. హైదరాబాద్‌లోని సన్‌షైన్ హెల్త్ కేర్ సర్వీసెస్‌లో 40 పోస్టుల భర్తీ కోసం నిర్వహించే ఈ జాబ్‌మేళా టేకులపల్లి ప్రభుత్వ ఐటీఐలోని మోడల్ కెరీర్ సెంటర్‌లో జరుగుతుందని పేర్కొన్నారు. ఎస్సెస్సీ విద్యార్హత కలిగిన అభ్యర్థులు ఉదయం 10 గంటలకు రావాలని సూచించారు.

వీడియో కాల్ మాట్లాడుతూనే.. ఆత్మహత్య

ఖమ్మంఅర్బన్: ఖమ్మం 8వ డివిజన్ వైఎస్సార్‌నగర్‌కు చెందిన వ్యక్తి స్నేహితుడికి వీడియో కాల్ చేసి మాట్లాడుతూనే ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఖమ్మం అర్బన్ పోలీసుల కథనం ప్రకారం... కామేపల్లి మండలం సాతానిగూడెంకు చెందిన నాగరాజు(30) నాలుగేళ్లుగా వైఎస్సార్‌నగర్‌లో ఉంటూ డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. ఇటీవల మద్యానికి బానిసైన ఆయన భార్యతో ఘర్షణ పడుతుండడంతో ఆమె కుమారుడిని తీసుకుని పుట్టింటికి వెళ్లింది. దీంతో మనస్తాపానికి గురై బుధవారం అర్ధరాత్రి సాతానిగూడెంలో ఉన్న తన మిత్రుడుకి వీడియోకాల్ చేసి ఉరి వేసుకుంటున్నానని చెబుతూ ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఘటనపై నాగరాజు సోదరుడి ఫిర్యాదుతో గురువారం పోలీసులు కేసు నమోదు చేశారు.

నిర్దేశిత లక్ష్యాలను పూర్తి చేయాలి



కూసుమంచి : మునిగేపల్లిలో పరీక్షలపై ఆరా తీస్తున్న డీఎంహెచ్‌ఓ మాలతి

నేలకొండపల్లి/కూసుమంచి: కంటి వెలుగు కేంద్రాల్లో సిబ్బంది కచ్చితంగా సమయపాలన పాటించాలని డీఎంహెచ్‌ఓ డాక్టర్ బి.మాలతి ఆదేశించారు. నేలకొండపల్లి, కూసుమంచి మండలం కిష్టాపురం, మునిగేపల్లిలోని కేంద్రాలను గురువారం ఆమె తనిఖీ చేశారు. ఈ సందర్భంగా డీఎంహెచ్‌ఓ మాట్లాడుతూ ప్రతీ కేంద్రంలో ఉదయం 9నుంచి సాయంత్రం 4 గంటల వరకు సిబ్బంది ఉండాలని ఆదేశించారు. కేంద్రాలకు వచ్చే వారికి క్షుణ్ణంగా పరీక్షించి అవసరమైన వారికి అద్దాలు ఇవ్వాలని సూచించారు. అలాగే, కేంద్రాల వారీగా నిర్దేశించిన లక్ష్యాలను పూర్తి చేయాలని డీఎంహెచ్‌ఓ తెలిపారు. వైద్యాధికారులు శ్రావణ్‌కుమార్, మణిబాబు, కిషోర్, సర్పంచ్‌లు పందరి పద్మ, గుగ్గిళ్ల మోహన్, ఉద్యోగులు వీరన్న, చంద్రశేఖర్, వలీయుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

రైల్వేగేట్ల నడుమ నిలిచిన గూడ్స్



గేట్ వద్ద నిలిచిపోయిన గూడ్స్ రైలు

కారేపల్లి: విద్యుత్ సరఫరా ఆగిపోవడంతో బొగ్గు లోడుతో వెళ్తున్న గూడ్స్ రైలు కారేపల్లి – పేరుపల్లి, కారేపల్లి – ఇల్లెందు రైల్వే గేట్ల మధ్యలో నిలిచిపోగా.. వాహనదారులు గంటల తరబడి అవస్థ పడ్డారు. కొత్తగూడెం నుంచి డోర్నకల్ వైపు బొగ్గు లోడ్‌తో ఉన్న గూడ్స్ రైలు సరిగ్గా.. కారేపల్లి–పేరుపల్లి, కారేపల్లి–ఇల్లెందు రైల్వేగేట్ల మీదుగా వెళ్తుండడంతో విద్యుత్ ట్రిప్ అయ్యి సరఫరా నిలిచిపోయింది. దీంతో రెండు గేట్ల మధ్య నిలిచిపోవడం, వాహనదారులు వెళ్లే పరిస్థితి లేకపోవడంతో గంటన్నర పాటు వాహనదారులు ఇబ్బంది పడ్డారు. ఈకారణంగా కారేపల్లి నుంచి ఇల్లెందు, పేరుపల్లి వైపు రాకపోకలు నిలిచిపోయాయి.

బేతుపల్లి భూములపై ఆర్డీఓ విచారణ



ఆర్డీఓకు డాక్యుమెంట్లు ఇస్తున్న భూ బాధితులు

సత్తుపల్లి: మండలంలోని బేతుపల్లిలో సర్వే నంబర్ 133కు సంబంధించి వివాదాస్పద భూములపై కల్లూరు ఆర్డీఓ సూర్యనారాయణ గురువారం విచారణ చేపట్టారు. ఈమేరకు తహసీల్దార్ కార్యాలయానికి వచ్చిన ఆయన సర్వే నంబర్ 133/164/4లోని ముత్తా వెంకటేశ్వరరావుకు చెందిన భూమి ఎలా బదలాయింపు జరిగిందో వివరాలు సేకరించారు. స్లాట్ ఎవరు బుక్ చేశారు, రిజిస్ట్రేషన్ సమయాన కుటుంబీకులు ఉండాలనే నిబంధనను ఎందుకు విస్మరించారని సిబ్బందిని ప్రశ్నించారు. అలాగే, గంగారంలోని వివాదాస్పద భూములకు సంబంధించి సర్వే నంబర్లు, మిగులు భూమి ఎంత ఉందో డాక్యుమెంట్లను పరిశీలించారు. కాగా, బాధితులు ఆర్డీఓను కలిసి మాట్లాడుతూ..శ్లాట్ బుకింగ్ చేసేటప్పుడే ప్రణాళికాయుతంగా ముందుకు సాగారని, తమ భూమిని ఇతరుల పేరిట రిజిస్ట్రేషన్ ఇప్పుడు రానివ్వడం లేదని ఫిర్యాదు చేశారు. దీనిపై ఆర్డీఓ సూర్యనారాయణ మాట్లాడుతూ భూములు, డాక్యుమెంట్లకు క్షుణ్ణంగా పరిశీలించాక కలెక్టర్‌కు నివేదిక ఇస్తామని తెలిపారు.

రూ.2లక్షల విలువైన గంజాయి పట్టివేత



స్వాధీనం చేసుకున్న గంజాయితో పోలీసులు

ఖమ్మంక్రైం: ఖమ్మం రైల్వే స్టేషన్‌లో రూ.5లక్షల విలువైన గంజాయిని స్వాధీనం చేసుకుని మూడు రోజులు కాకముందే మరోసారి జీఆర్పీ పోలీసుల తనిఖీల్లో రూ.2లక్షల విలువైన గంజాయి పట్టుబడింది. స్టేషన్‌లోని ఒకటో నంబర్ ప్లాట్‌ఫాంపై రైల్వే క్యాంటీన్ వద్ద పోలీసులకు గురువారం రెండు బ్యాగ్‌లు అనుమానాస్పదంగా కనిపించడంతో తనిఖీ చేయగా రూ.2లక్షల విలువైన తొమ్మిది కేజీల గంజాయి లభ్యమైంది. అయితే, బ్యాగులు ఎవరి తీసుకొచ్చారనే అంశంపై దర్యాప్తు చేస్తున్నారు. ఈ తనిఖీల్లో రైల్వే ఎస్సై భాస్కర్‌రావు, హెడ్‌కానిస్టేబుల్ సత్యనారాయణరెడ్డి, తదితర సిబ్బంది పాల్గొన్నారు.

కూలీ పనులకు వెళ్లిన వృద్ధురాలి మృతి

తిరుమలాయపాలెం: కూలీ పనులకు వెళ్లిన వృద్ధురాలు అస్వస్థతకు గురై మృతి చెందిన ఘటన మండలంలోని బచ్చోడులో గురువారం చోటుచేసుకుంది. గ్రామస్తుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన సందు బుచ్చమ్మ(68) గురువారం మిర్చి తోటలో కాయలు ఏరేందుకు వెళ్లింది. మధ్యాహ్నం భోజనం చేసే సమయాన ఆమె కళ్లు తిరిగి పడిపోవడంతో తోటికూలీలు సపర్యలు చేస్తుండగా మృతి చెందింది. బుచ్చమ్మకు భర్త మల్లయ్య, ఇద్దరు కుమారులు ఉన్నారు.

గుర్తు తెలియని మృతదేహం లభ్యం



గుర్తు తెలియని మృతదేహం

కొణిజర్ల: మండలంలోని తనికెళ్ల సమీపాన విజయ ఇంజనీరింగ్ కళాశాల వద్ద రోడ్డు పక్కన గుర్తు తెలియని వ్యక్తి(47) మృతదేహాన్ని గురువారం గుర్తించారు. ఉత్తర భారతదేశానికి చెందిన వ్యక్తిగా భావిస్తుండగా, యాచకుడిగా అనుమానముందని ఎస్సై టి.యయాతి రాజు పేర్కొన్నారు. మృతదేహాన్ని ఖమ్మం ఆస్పత్రి మార్చురీకి తరలించామని, సంబంధీకులు తమను సంప్రదించాలని ఎస్సై సూచించారు.

విద్యుత్ స్తంభాన్ని ఢీకొట్టిన మిర్చి వ్యాన్

15 క్వింటాళ్ల మిర్చి దగ్ధం, డ్రైవర్‌కు షాక్

రఘునాథపాలెం: మండలంలోని మంచుకొండ వద్ద ఖమ్మం – ఇల్లెందు ప్రధాన రహదారిపై మిర్చి లోడ్‌తో ఖమ్మం మార్కెట్‌కు వెళ్తున్న వ్యాన్ రోడ్డు పక్కన విద్యుత్ స్తంభాన్ని ఢీకొట్టగా మంటలు చెలరేగాయి. ఈ ఘటనలో 15 క్వింటాళ్ల మిర్చి దగ్ధం కావడంతో పాటు వ్యాన్ డ్రైవర్‌కు గాయాలయ్యాయి. పోలీసుల కథనం ప్రకారం.. కామేపల్లి మండలం గోవింద్రాల నుంచి మినీ వ్యాన్‌లో 35 క్వింటాళ్ల మిర్చితో రైతులు గుగులోతు సురేష్, లకావత్ విన్ని ఖమ్మం మార్కెట్‌కు గురువారం తెల్లవారుజామున బయలుదేరారు. మంచుకొండ వద్ద ఈ వ్యాన్ విద్యుత్ స్తంభాన్ని ఢీకొట్టగా, విద్యుత్ తీగలు తెగిపడడంతో మిర్చికి మంటలు అంటుకుని 15 క్వింటాళ్ల మేర దగ్ధమైంది. ఈమేరకు సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది మంటలను అదుపులోకి తీసుకొచ్చారు. అలాగే, వ్యాన్ డ్రైవర్ విద్యుదాఘాతానికి గురి కాగా ఆస్పత్రికి తరలించారు. అయితే, ఘటనపై ఇంకా ఫిర్యాదు అందలేదని రఘునాథపాలెం ఎస్సై రవి తెలిపారు.

క్లుప్తంగా...

నెల్లూరు రూరల్ వైఎస్సార్‌సీపీ అభ్యర్థిగా ఆదాల



సాక్షి, అమరావతి: నెల్లూరు రూరల్ నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ సమన్వయకర్తగా నెల్లూరు ఎంపీ ఆదాల ప్రభాకర్‌రెడ్డిని పార్టీ అధ్యక్షుడు, ఏపీ సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి నియమించారని ఆ పార్టీ ప్రధాన కార్య దర్శి, ప్రభుత్వ సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డి తెలిపారు. వచ్చే ఎన్నికల్లో నెల్లూరు రూరల్ నియోజకవర్గం నుంచి పార్టీ అభ్యర్థిగా ఆదాల ప్రభాకర్‌రెడ్డే పోటీ చేస్తారని ప్రకటించారు. గురువారం తాడేపల్లిలోని క్యాంపు కార్యాలయంలో సీఎం వైఎస్ జగన్‌తో సజ్జల రామ కృష్ణారెడ్డి, ప్రాంతీయ సమన్వయకర్త బాలినేని శ్రీనివాసరెడ్డి, ఆదాల ప్రభాకర్‌రెడ్డి తదితరులు సమావేశమ య్యారు. అనంతరం సజ్జల మీడియాతో మాట్లాడారు. నెల్లూరు రూరల్ నియోజకవర్గం నుంచి 2024 ఎన్నికల్లో టీడీపీ అభ్యర్థిగా పోటీ చేస్తానని కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి ప్రకటించిన ఆడియో ఇటీవల సర్క్యులేట్ అయ్యిందని గుర్తు చేశారు. టీడీపీలోకి వెళ్లాలని నిర్ణయం తీసుకున్నాక కోటంరెడ్డి చేసిన వ్యాఖ్యల నేపథ్యంలో ఖాళీ అయిన నెల్లూరు నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త స్థానాన్ని ఎంపీ ఆదాల ప్రభాకర్‌రెడ్డితో సీఎం వైఎస్ జగన్ భర్తీ చేశారని వివరించారు. బాలి నేని శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ నెల్లూరు రూ రల్ నియోజకవర్గంలో ఇకపై ఆదాల ద్వారానే అన్ని కార్యక్రమాలు జరుగుతాయని స్పష్టం చేశారు. వచ్చే ఎన్నికల్లో ఆదాల విజయం నల్లేరుపై నడకేనని ధీమా వ్యక్తం చేశారు.

హుండీ ఆదాయంలో రికార్డుల మోత

ఆపద మొక్కులవాడి ఆదాయం 11 నెలల్లోనే రూ.1,414.21 కోట్లు

తిరుమల: ఆపద మొక్కులవాడికి సాధారణంగా మే, జూన్ నెలల్లో మాత్రమే హుండీ ద్వారా లభించే ఆదాయం నెలకు రూ.100 కోట్లు దాటేది. మిగిలిన నెలల్లో నెలకు రూ.100 కోట్లలోపే ఉండేది. ప్రస్తుతం శ్రీవారికి నిత్యం రూ.4 కోట్లకు పైగా హుండీ ఆదాయం లభిస్తోంది. టీటీడీ చరిత్రలో ముందెన్నడూ లేని విధంగా గత ఏడాది మార్చి నుంచి ప్రతినెలా హుండీ ఆదాయం రూ.100 కోట్లు దాటుతోంది. గడచిన 11 నెలల్లో రూ.1,414.21 కోట్లు రాగా.. ఈ ఏడాది రూ.1,500 కోట్ల మార్కును దాటిపోనుంది.

తరలిపోతున్న తెల్ల బంగారం



పత్తి పంటకు ఆదిలాబాద్ జిల్లాలో సరైన మద్దతు ధర లేక మహారాష్ట్రకు తరలిపోతోంది. జిల్లాలో గురువారం పత్తి క్వింటాకు సీసీఐ ధర రూ.7,700 పలుకగా, ప్రైవేటు వ్యాపారులు రూ.7710కు కొనుగోలు చేశారు. జైనథ్ మండలం మాండగడ గ్రామం వద్ద పత్తిని వాహనంలో తరలిస్తుండగా కనిపించిన దృశ్యమిదీ.

– సాక్షి ఫొటోగ్రాఫర్, ఆదిలాబాద్

ట్యాపింగ్ కాదది.. రికార్డింగే

జరగని ఫోన్ ట్యాపింగ్ జరిగినట్లుగా చిత్రీకరిస్తూ చంద్రబాబు కుట్ర

జాతీయ సమస్యగా దానిపై పోరాటం చేసే స్థాయికి దిగజారిన వైనం

- ఈ కుట్రలో కోటంరెడ్డి పాత్రధారి
- వైఎస్సార్‌సీపీ ప్రధాన కార్యదర్శి సజ్జల రామకృష్ణారెడ్డి
- వైఎస్సార్‌సీపీ లేకుంటే ఎమ్మెల్యే అయ్యేవాడివా?
- ఏపీ మంత్రి పెద్దిరెడ్డి మండిపాటు
- ఇది నమ్మకద్రోహం
- మాజీ మంత్రి పేర్ని నాని ధ్వజం

సాక్షి, అమరావతి : 'ఏపీలో రాజకీయం చేయడానికి ఏ సమస్యా లేకపోవడంతో జరగనే జరగని ఫోన్ ట్యాపింగ్ జరిగినట్లు చిత్రీకరించి.. దానిని జాతీయ సమస్యగా సృష్టించి, పోరాటం చేసే స్థాయికి టీడీపీ అధ్యక్షుడు చంద్రబాబు దిగజారారు. ఈ కుట్రలో కోటంరెడ్డి పాత్రధారి. ఇందులో భాగంగా కోటంరెడ్డి ప్రభుత్వంపై బురద చల్లి పార్టీ వీడాలనుకోవడం దారుణం. ఇంతకూ రికార్డ్ చేసింది కోటంరెడ్డి మిత్రుడే' అని వైఎస్సార్‌సీపీ ప్రధాన కార్యదర్శి, ఏపీ ప్రభుత్వ సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డి, విద్యుత్, అటవీ, గనుల శాఖ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, మాజీ మంత్రి పేర్ని వెంకట్రామయ్య (నాని) మండిపడ్డారు. గురువారం వారు వేర్వేరుగా మీడియాతో మాట్లాడారు. ఆ వివరాలు వారి మాటల్లోనే..

టీడీపీలో చేరే వారు బావిలో దూకినట్లే

ఇష్టం లేనివారు టీడీపీలోకి వెళ్లాలనుకుంటే వెళ్లొచ్చు. కానీ ప్రభుత్వంపై, వైఎస్సార్‌సీపీపై బురదజల్లాలనుకోవడం సమంజసం కాదు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వైఎస్సార్‌సీపీని స్థాపించకపోతే నీలాంటి వాళ్లు ఎమ్మెల్యేలుగా ఎన్నికయ్యే వారా? కోటంరెడ్డి ఆరోపిస్తున్నట్లుగా అది ఫోన్ ట్యాపింగ్ కానే కాదు. ఆయన మిత్రుడే రికార్డ్ చేశారన్న విషయం కోటంరెడ్డికి కూడా తెలుసు. ఇదంతా చంద్రబాబు కుట్ర. ఇలాంటి కుట్రలు, కుతంత్రాలకు సీఎం వైఎస్ జగన్ భయపడరు. టీడీపీలో చేరే ఎమ్మెల్యేలు బావిలో దూకినట్టే.

– పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, విద్యుత్, అటవీ, గనుల శాఖ మంత్రి

టీడీపీ రాజకీయ లబ్ధి కోసమే..



నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి ఫోన్ సంభాషణను ఆయన మిత్రుడే రికార్డింగ్ చేసి.. అందరికీ పంపారు. బయట సర్క్యులేట్ అవుతున్న ఆ ఆడియో క్లిప్‌ను ఇంటెలిజెన్స్ అధికారి కోటంరెడ్డికి పంపి, సరి చూసుకోవాలని సూచించారు. వైఎస్సార్‌సీపీ తరఫున రెండుసార్లు ఎమ్మెల్యేగా గెలిచిన కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి టీడీపీ అధ్యక్షుడు చంద్రబాబుతో సమావేశమయ్యాక.. 2024లో టీడీపీ అభ్యర్థిగా పోటీ చేస్తానని చెప్పిన మాటల ఆడియో కూడా సర్క్యులేట్ అవుతోంది. చంద్రబాబుతోనూ లోకేశ్‌తోనూ కోటంరెడ్డి ఎప్పటికప్పుడు మాట్లాడుతున్నారని టీడీపీ నేతలే చెబుతున్నారు. ఫోన్ ట్యాపింగ్ చేసి ఉంటే.. చంద్రబాబుతో కోటంరెడ్డి సంప్రదింపులు జరుపుతున్నట్లుగా మేం అప్పుడే గుర్తించేవాళ్లం కాదా? టీడీపీ ప్రభుత్వ హయాంలో ఏబీ వెంకటేశ్వరరావు ద్వారా చంద్రబాబు.. మా ఫోన్లను ట్యాపింగ్ చేశారని.. దానిపై న్యాయస్థానంలో కేసు కూడా వేశాం. వాళ్లలాగే వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం కూడా ఫోన్ ట్యాపింగ్ చేస్తున్నట్లు రాజకీయ లబ్ధి కోసం టీడీపీ కుట్రపూరితంగా చిత్రీకరిస్తోంది.


– సజ్జల రామకృష్ణారెడ్డి, వైఎస్సార్‌సీపీ ప్రధాన కార్యదర్శి, ప్రభుత్వ సలహాదారు

డిసెంబర్ 25న బాబును కలిశారు



'నీ ఫోన్ సంభాషణను నీ మిత్రుడు రామశివారెడ్డి రికార్డ్ చేసి, అందరికీ పంపారు. అది బయట సర్క్యులేట్ అవుతుంటే.. ఇంటెలిజెన్స్ అధికారి దాన్ని నీకు వాట్సాప్‌లో పంపి.. సరి చూసుకోవాలని సూచించడంలో తప్పేముంది? ఇది వాస్తవం కాదంటే.. నీ ఫోన్‌కు సంబంధించి గత ఆర్నెల్ల వాట్సాప్ డేటాను బహిర్గతం చేయగలవా? కోటంరెడ్డిని సీఎం జగన్ ఎంతగానో నమ్మితే.. ఇలా నమ్మక ద్రోహానికి పాల్పడటం తగదు. 'డిసెంబర్ 25న బ్లూ కలర్ బెంజ్ కారులో చంద్రబాబు ఇంటికి కోటంరెడ్డి వచ్చి.. రెండు గంటలపాటు మాట్లాడి వెళ్లారు. ఇదివరకట్లాగే నారాయణతో సంబంధాలు కొనసాగించాలని బాబు చెప్పారు. లోకేశ్‌తో ఎప్పటికప్పుడు సంప్రదింపులు జరుపుతున్నారు. పాదయాత్రకు ముందు లోకేశ్ సలహాలు కూడా అడిగారు. కోటంరెడ్డి ఆస్పత్రిలో ఉన్నప్పుడు లోకేశ్ ఫోన్ ద్వారా పరామర్శించారు' అని టీడీపీ నేతలు, కోటంరెడ్డి పక్కనున్న వారే చెబుతున్నారు.

– పేర్ని నాని, మాజీ మంత్రి



కన్హా శాంతివనంలో గురూజీ కమ్లేశ్ పటేల్‌తో హైకోర్టు చీఫ్ జస్టిస్ ఉజ్జల్ భూయాన్, న్యాయమూర్తుల బృందం

దేశప్రగతికి ఆధ్యాత్మికత మూలాధారం

లాలాజీ మహరాజ్ జయంతి ఉత్సవాల్లో కేంద్రమంత్రి దేవుసింగ్ చౌహాన్

నందిగామ: సమాజంలోని ప్రతివ్యక్తి ఆధ్యాత్మికతను అలవర్చుకున్నట్లయితే అందమైన ప్రపంచం తయారవుతుందని, దేశప్రగతికి ఆధ్యాత్మికత మూలాధారమని కేంద్ర సమాచార, ప్రసార శాఖ మంత్రి దేవుసింగ్ జేసింగ్ భాయ్ చౌహాన్ అన్నారు. రంగారెడ్డి జిల్లా నందిగామలోని కన్హా శాంతి వనంలో జరిగిన శ్రీ రామచంద్ర మిషన్ వ్యవస్థాపకుడు లాలాజీ మహరాజ్ 150వ జయంతి ఉత్సవంలో ఆయన వర్చువల్ విధానంలో మాట్లాడారు. ప్రతి వ్యక్తి హార్ట్‌ఫుల్‌నెస్ పద్ధతి ద్వారా ధ్యానం చేసినట్లయితే ఆత్మశుద్ధి అవుతుందన్నారు. ప్రస్తుత గురూజీ కమ్లేశ్ పటేల్‌కు పద్మభూషణ్ అవార్డు రావడం సంతోషించదగ్గ విషయమన్నారు. గురూజీ కమ్లేశ్ పటేల్ మాట్లాడుతూ ప్రాణాహుతి, హార్ట్‌ఫుల్‌నెస్ ద్వారా ధ్యానం చేయడం ద్వారా మానసిక ప్రశాంతత లభిస్తుందన్నారు. అనంతరం చీఫ్ పోస్ట్‌మాస్టర్ జనరల్ ప్రకాశ్, సర్కిల్ అధికారి రేవా ఆధ్వర్యంలో లాలాజీ స్మారక పోస్టల్ స్టాంపును విడుదల చేశారు. ఈ సందర్భంగా నిర్వహించిన ప్రముఖ సంగీత కళాకారుడు హరిప్రసాద్ చౌరాసియా సంగీత విభావరి అలరించింది. ఉత్సవాలకు హైకోర్టు చీఫ్ జస్టిస్ ఉజ్జల్ భూయాన్‌తోపాటు జస్టిస్ రాధారాణి, జస్టిస్ ఎస్.నంద, జస్టిస్ విజయ్‌సేన్‌రెడ్డి, జస్టిస్ భీమపాక నగేశ్, జస్టిస్ నవీన్‌రావు, జస్టిస్ శ్రీసుధ, జస్టిస్ నాగార్జున్, జస్టిస్ సురేందర్, జస్టిస్ సుధీర్‌కుమార్‌లు పాల్గొని ధ్యానం చేశారు.

దేశవ్యాప్తంగా ఏపీ 'పెట్టుబడుల' సదస్సులు

- ముంబై, అహ్మదాబాద్, బెంగళూరు, కోల్‌కతా, త్రివేంద్రం, చెన్నై, హైదరాబాద్‌లో నిర్వహణ

సాక్షి, అమరావతి: పెట్టుబడులను ఆకర్షించడం ద్వారా విశాఖలో మార్చి నెలలో జరిగే గ్లోబల్ ఇన్వెస్టర్స్ సదస్సును విజయవంతం చేయడమే లక్ష్యంగా.. దేశవ్యాప్తంగా పెట్టుబడుల సన్నాహక సదస్సులను ఏపీ ప్రభుత్వం నిర్వహించబోతోంది. ఫిబ్రవరి 10 నుంచి 24 వరకు దేశంలోని 7 ప్రధాన నగరాల్లో రోడ్‌షోలు నిర్వహించేందుకు ఏపీ ఎకనామిక్ డెవలప్‌మెంట్ బోర్డు ప్రణాళికలు రూపొందించింది. సీఎం జగన్ ఇటీవల ఢిల్లీలో ప్రారంభించిన గ్లోబల్ ఇన్వెస్టర్స్ సన్నాహక సదస్సు విజయవంతమవ్వడంతో.. అదే స్ఫూర్తితో ఈ రోడ్‌షోలను కూడా నిర్వహించబోతోంది. ఫిబ్రవరి 10న త్రివేంద్రం, కోల్‌కతా, 14న బెంగళూరులో, 17న చెన్నై, అహ్మదాబాద్, 21న ముంబై, 24వ తేదీన హైదరాబాద్‌లో ఈ రోడ్‌షోలు నిర్వహించాలని నిర్ణయించింది. రాష్ట్రంలో పెట్టుబడులకు అవకాశమున్న వనరులు, ప్రయోజనాలను వివరించడంతో పాటు ప్రధానంగా 13 రంగాల్లో పెట్టుబడుల ఆకర్షణే లక్ష్యంగా ఈ రోడ్ షోలు నిర్వహించనున్నట్లు అధికారులు తెలిపారు. ఏపీలో పెట్టుబడులు పెట్టడానికి పలు సంస్థలు ఇప్పటికే ఆసక్తిని వ్యక్తం చేశాయి. మార్చి 3–4 తేదీల్లో విశాఖ వేదికగా జరిగే గ్లోబల్ ఇన్వెస్టర్స్ సదస్సులో ఆ సంస్థలు రాష్ట్రంలో పెట్టుబడులు పెడుతూ.. వాస్తవ ఒప్పందాలు చేసుకుంటాయని పరిశ్రమల శాఖ అధికారులు వెల్లడించారు.

మాజీ సీఎస్ సోమేశ్‌కు బెయిలబుల్ వారెంట్

కోర్టు ధిక్కరణ కేసులో హైకోర్టు జారీ



సాక్షి, హైదరాబాద్: జూబ్లీహిల్స్ హౌసింగ్ సొసైటీలో ఒక ప్లాట్‌కు సంబంధించిన వ్యవహారంలో ప్రభుత్వ మాజీ ప్రధాన కార్యదర్శి సోమేశ్‌కుమార్‌కు హైకోర్టు బెయిలబుల్ వారెంట్ జారీ చేసింది. కోర్టుకు హాజరుకావాలని పలుమార్లు ఆదేశించినా.. రాకపోవడంతో ఈ మేరకు చర్యలు తీసుకుంది. హౌసింగ్ సొసైటీ వ్యవహారంలో కోర్టు తీర్పు అమలు చేయనందుకు సోమేశ్‌పై చర్యలు తీసుకోవాలని కోరుతూ విశాఖపట్నంకు చెందిన జయరావు కోర్టు ధిక్కరణ పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై జస్టిస్ ముమ్మినేని సుధీర్‌కుమార్ గురువారం విచారణ చేపట్టారు. వాదనలు విన్న న్యాయమూర్తి.. మాజీ సీఎస్‌కు బెయిలబుల్ వారెంట్ జారీ చేశారు.

జిల్లా వార్తలు


కేంద్ర మంత్రి గడ్కరీని కలిసిన ఎంపీ రవిచంద్ర



గడ్కరీకి వినతిపత్రం అందజేస్తున్న ఎంపీ

ఖమ్మంమయూరిసెంటర్: కేంద్ర ఉపరితల రవాణా శాఖ మంత్రి నితిన్ గడ్కరీతో గురువారం రాజ్యసభ ఎంపీ వద్దిరాజు రవిచంద్ర ఢిల్లీలో భేటీ అయ్యారు. ఈసందర్భంగా ఖమ్మం మీదుగా వెళ్లే నాగపూర్ – అమరావతి గ్రీన్‌ఫీల్డ్ హైవే అలైన్‌మెంట్‌ను ఖమ్మం కలెక్టరేట్ వద్ద మార్చాలని కోరారు. ప్రతిపాదిత అలైన్‌మెంట్ సమీకృత కలెక్టరేట్ మధ్య నుంచి వెళ్తుండడంతో ఇబ్బంది ఏర్పడనున్న దృష్ట్యా కలెక్టరేట్ వెనుక నుంచి వెళ్లేలా సవరించాలని విజ్ఞప్తి చేశారు. ఇదే హైవేపై ఖమ్మం, విజయవాడ మార్గం నుంచి వచ్చే వాహనాలు సూర్యాపేట వద్ద కలిసే మార్గంలో అండర్ పాస్ నిర్మించాలని, జాతీయ రహదారి 65పై చౌటుప్పల్ మండలం తూప్రాన్‌పేట వద్ద కూడా అండర్ పాస్ మంజూరు చేయాలని కోరగా, కేంద్ర మంత్రి గడ్కరీ సానుకూలంగా స్పందించారని ఎంపీ ఓ ప్రకటనలో వెల్లడించారు.

పైనంపల్లి సొసైటీని సందర్శించిన నాబార్డ్ జీఎం



గోదాంను పరిశీలిస్తున్న నాబార్డు జీఎం వెంకటేష్ తదితరులు

నేలకొండపల్లి: మండలంలోని పైనంపల్లి ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘాన్ని నాబార్డు జీఎం వెంకటేష్ గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా సొసైటీ ఆధ్వర్యాన నిర్మించిన 300 మెట్రిక్ టన్నుల గోదాం, సూపర్‌మార్కెట్‌ను పరిశీలించాక రికార్డులను తనిఖీ చేశారు. అనంతరం రైతులకు అందిస్తున్న సేవలపై ఆరా తీసిన ఆయన సొసైటీ సేవలను ప్రశంసించారు. నాబార్డు డీడీఎం సుజిత్, డీసీసీబీ బ్రాంచి మేనేజర్ ఇందు, డీసీఎంఎస్ డైరెక్టర్ నాగుబండి శ్రీనివాసరావుతో పాటు కలకుంట్ల శ్రీను, చిట్లా భాస్కర్‌రెడ్డి, వేసేపల్లి నాగేశ్వరరావు, బాలాజీ, చల్లగుండ్ల వెంకట్రామయ్య, జగదీష్ తదితరులు పాల్గొన్నారు.

ఖమ్మంకు జాతీయ కీర్తి

- స్వచ్ఛ సర్వేక్షణ్ గ్రామీణ త్రీస్టార్ కేటగిరీలో దేశంలోనే ఫస్ట్
- ఐదో స్థానంతో సత్తా చాటిన భద్రాద్రి జిల్లా
- పలు అంశాల్లో ఆదర్శంగా నిలిచిన గ్రామపంచాయతీలు
- ఫోర్త్ స్టార్‌లోకి ప్రవేశించిన ఖమ్మం జిల్లా



ఎస్‌బీఎం ఆధ్వర్యాన నిర్మించిన మరుగుదొడ్డి



మరుగుదొడ్డి వినియోగంపై వేసిన వాల్‌పెయింట్

ఖమ్మంమయూరిసెంటర్: ఖమ్మం కీర్తిపతాక జాతీయ స్థాయిలో రెపరెపలాడింది. స్వచ్ఛభారత్ మిషన్ గ్రామీణ్ అమలుచేస్తున్న పలు కార్యక్రమాల్లో జిల్లాలోని గ్రామపంచాయతీలు ఆదర్శంగా నిలుస్తున్నాయి. కేంద్రప్రభుత్వం తాజాగా ప్రకటించిన స్వచ్ఛ సర్వేక్షణ్ గ్రామీణ ర్యాంకింగ్‌లో జిల్లా దేశంలోనే మొదటి స్థానంలో నిలిచింది. ఓడీఎఫ్ ప్లస్ విభాగంలో త్రీ స్టార్ కేటగిరిలో జిల్లాకు ఈ ఘనత దక్కింది. వ్యక్తిగత మరుగుదొడ్ల నిర్మాణం, వినియోగం, తడిచెత్తతో సేంద్రియ ఎరువు తయారీ, పొడి చెత్త అమ్మకం ద్వారా గ్రామపంచాయతీలకు ఆదాయం, మురుగు నీటి నిర్మూలన తదితర అంశాలను ప్రామాణికంగా తీసుకుని కేంద్రప్రభుత్వం ర్యాంకులు ప్రకటించింది. ఈ ఆర్థిక సంవత్సరం చివరికల్లా '5 స్టార్' విభాగంలో అగ్రస్థానంలో నిలిచి జాతీయస్థాయి అవార్డు సాధించేందుకు జిల్లాకు అవకాశాలు ఉన్నాయి.

ఓడీఎఫ్‌పై ప్రత్యేక దృష్టి

జిల్లాలోని ప్రతీ ఇంట్లో మరుగుదొడ్డి ఉండేలా జిల్లా అధికారులు లక్ష్యాన్ని ఏర్పాటు చేసుకున్నారు. ఈ దిశగా ఐదేళ్ల నుంచి కృషి చేస్తూ వచ్చారు. గృహాలతోపాటు ప్రభుత్వ కార్యాలయాలు, కమ్యూనిటీ హాళ్ల వద్ద మరుగుదొడ్లను నిర్మించి బహిరంగ మల విసర్జన రహిత గ్రామాలుగా ప్రకటించాలనే కృతనిశ్చయంతో కృషి చేశారు. గృహ యజమానులకు అవగాహన కల్పించి నిర్మాణాలను పూర్తి చేయించగా.. ఖమ్మంను ఓడీఎఫ్ జిల్లాగా, 561 గ్రామపంచాయతీలను ఓడీఎఫ్ ప్లస్‌గా ప్రకటించారు. ఇంకా కంపోస్ట్ షెడ్ల వినియోగం, అన్ని గ్రామాల్లో మురుగునీటి నిర్వహణ, పరిశుభ్రంగా తీర్చిదిద్దడం, పారిశుద్ధ్యానికి సంబంధించి వాల్ పెయింటింగ్స్ వేయించడంతో త్రీస్టార్ కేటగిరీలో జిల్లాకు మొదటిస్థానం లభించింది.

సమష్టి కృషితో..

ఓడీఎఫ్ గ్రామాలుగా తీర్చిదిద్దడంపై అధికారులు మొదటి నుంచి విస్తృత ప్రచారం నిర్వహించారు. బహిరంగ మల, మూత్ర విసర్జన రహిత గ్రామాలను తయారు చేయడమే లక్ష్యంగా కలెక్టర్, అదనపు కలెక్టర్, డీఆర్‌డీఏ అధికారులు, ఎస్‌బీఎం సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులు, ఈజీఎస్ కార్మికులు ప్రజల్లో అవగాహన కల్పించారు. కార్యదర్శులు గ్రామాల్లో చేపట్టిన పనులను ఎప్పటికప్పుడు నివేదికల రూపంలో ఎస్‌బీఎం సిబ్బందికి అందించడం, ఆపై అదనపు కలెక్టర్, డీఆర్డీఓ సమక్షాన కేంద్రప్రభుత్వ వెబ్‌సైట్లలో పొందుపరుస్తూ కేంద్ర జలశక్తి శాఖ దృష్టికి తీసుకెళ్లారు. దీంతోపాటు కేంద్ర బృందాలు ఎంపిక చేసుకుని పరిశీలించిన జీపీల్లో.. జిల్లా అధికారులు ఇచ్చిన నివేదికల ఆధారంగా పనులు జరిగినట్లు తేలడంతో జిల్లా దేశంలోనే మొదటి స్థానం సాధించేందుకు దోహదపడింది.

జాతీయ అవార్డే లక్ష్యం..


ప్రస్తుతం జిల్లా త్రీ స్టార్ విభాగంలో పోటీ పడి మొదటి స్థానం సాధించి.. 4 స్టార్‌లోకి ప్రవేశించింది. జిల్లాలో మొత్తం 589 గ్రామపంచాయతీలు ఉండగా.. వీటిలో 561 జీపీలను ఓడీఎఫ్ ప్లస్‌గా ప్రకటించారు. ఆయా జీపీల్లో 65,801 మరుగుదొడ్లు,589 సెగ్రిగేషన్ షెడ్లు నిర్మించారు. ఈ షెడ్ల ద్వారా సేంద్రియ ఎరువు తయారు చేసి అమ్మడంతో రూ.14.96 లక్షల ఆదాయం సమకూరింది. ఓడీఎఫ్ ప్లస్‌గా ఎంపికైన జీపీల్లో 147 జీపీలను జిల్లాస్థాయి బృందాలు తనిఖీ చేయగా, జిల్లాకు త్రీస్టార్ విభాగంలో మొదటి స్థానం దక్కింది. ఇక 561 గ్రామపంచాయతీల్లో 147పోగా మిగిలిన 414 గ్రామపంచాయతీల్లో కూడా పరిశీలించాక, 28 గ్రామపంచాయతీలనూ ఓడీఎఫ్ ప్లస్‌గా ప్రకటించి తనిఖీ చేస్తే ఈ ఏడాదికి గాను స్వచ్ఛ సర్వేక్షణ్ అవార్డు దక్కనుంది.

మంత్రి పువ్వాడ అభినందనలు

స్వచ్ఛ సర్వేక్షణ్‌లో దేశంలోనే ఖమ్మం మొదటిస్థానం సాధించడంపై రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ హర్షం వ్యక్తం చేశారు. ఈసందర్భంగా ఆయన ప్రజాప్రతినిధులు, అధికారులను అభినందించారు. కేంద్ర జలశక్తి శాఖ దేశంలో 44 పట్టణాలకు త్రీస్టార్ రేటింగ్ ఇవ్వగా.. అందులో 187.35 శాతం మార్కులతో ఖమ్మం జిల్లా దేశంలోనే మొదటి స్థానం, 122.57 మార్కులతో భద్రాద్రి జిల్లా ఐదో స్థానంలో నిలవడం గర్వకారణమని తెలిపారు.

సాగర్ జలాల కోసం రోడ్డెక్కిన అన్నదాతలు

- వైరా – జగ్గయ్యపేట ప్రధాన రహదారిపై రాస్తారోకో
- ఎన్నెస్పీ కార్యాలయంలో అధికారుల నిర్బంధం



బోనకల్ బీబీసీపై రాస్తారోకో చేస్తున్న రైతులు

బోనకల్: ఖమ్మం జిల్లా బోనకల్ బ్రాంచ్ కెనాల్(బీబీసీ) పరిధిలోని చివరి ఆయకట్టుకు సాగర్ జలాలు అందక పంటలు ఎండిపోతున్నాయని మండలంలోని రైతులు గురువారం రాస్తారోకో నిర్వహించారు. వారబందీ విధానంతో తమకు నీరందక మొక్కజొన్న పంట ఎండిపోతుందని ఆవేదన వ్యక్తం చేశారు. వైరా – జగ్గయ్యపేట ప్రధాన రహదారిపై చేపట్టిన రాస్తారోకోలో రైతులకు అఖిల పక్షం నాయకులతోపాటు అధికార పక్షం నాయకులు కూడా మద్దతు తెలపగా.. గంట పాటు ఇరువైపులా ట్రాఫిక్ భారీగా నిలిచిపోయింది.

600 క్యూసెక్కులేనా?

బీబీసీకి 1,376 క్యూసెక్కుల నీరు విడుదల చేయాల్సి ఉన్నా కేవలం 600 క్యూసెక్కులే విడుదల చేస్తుండడంతో పంటలు ఎండిపోతున్నాయని రైతులు వెల్లడించారు. రూ.వేలల్లో పెట్టుబడి పెట్టి పండించిన మొక్కజొన్న కళ్ల ముందే ఎండిపోతుంటే ఆత్మహత్యలే శరణ్యమని వాపోయారు. ఈమేరకు ఎన్నెస్పీ అధికారులు చేరుకుని ఉన్నతాధికారులను పిలిపించి మాట్లాడదామని సర్దిచెప్పడంతో రైతులు ఆందోళన విరమించారు. అయితే, కార్యాలయం వద్దకు వెళ్లాక ఉన్నతాధికారులు రాకపోవడంతో డీఈ శ్రీనివాసరావు, జేఈలు, సిబ్బందిని కార్యాలయంలో నిర్బంధించారు. దీంతో నోడల్ ఆఫీసర్ వెంకటేశ్వర్లు, ఈఈ రామకృష్ణ చేరుకోగా, నీరు విడుదల చేసి నాలుగు రోజులవుతున్నా నేటికి తమ పొలాలకు చేరలేదని రైతులు మండిపడ్డారు. మరో మూడు రోజులపాటు నీరు విడుదల చేస్తామనే హామీతో రైతులు ఆందోళన విరమించారు. బీఆర్ఎస్ సహా అఖిలపక్షం నాయకులు గాలి దుర్గారావు, దొండపాటి నాగేశ్వరరావు, కందుల పాపారావు, వేమూరి ప్రసాద్, చేబ్రోలు మల్లికార్జున్‌రావు, సర్పంచ్ కొమ్మినేని ఉపేందర్‌రావు, పారా ప్రసాద్, కాకాని శ్రీను తదితరులు పాల్గొన్నారు.

ముందస్తు లోక్ అదాలత్ ప్రారంభం

- బీమా కేసులో పరిహారం ఇప్పించిన జిల్లా జడ్జి శ్రీనివాసరావు
- ఆపై బ్యాంకు అధికారులతో సమీక్ష



లోక్ అదాలత్ అవార్డు అందజేస్తున్న జిల్లా జడ్జి శ్రీనివాసరావు, పక్కన న్యాయమూర్తి జావేద్‌పాషా

ఖమ్మంలీగల్: ఈనెల 11న జరగనున్న జాతీయ లోక్ అదాలత్‌కు సంబంధించి ముందస్తు కేసుల పరిష్కార ప్రక్రియ ప్రారంభమైంది. ఈమేరకు గురువారం జిల్లా ప్రధాన న్యాయమూర్తి డాక్టర్ టి.శ్రీనివాసరావు ఆధ్వర్యాన పలు కేసులను విచారించారు. ఇందులో భాగంగా రోడ్డు ప్రమాద కేసులో బాధిత కుటుంబానికి పరిహారం ఇప్పిస్తూ అవార్డు జారీ చేశారు. రోడ్డు ప్రమాదంలో ఇంజనీరింగ్ విద్యార్థి మృతిచెందగా కుటుంబ సభ్యులు ఫ్యూచర్ జనరల్ బీమా కంపెనీ నుంచి పరిహారం కోసం కేసు దాఖలు చేశారు. ఈ వివాదాన్ని జిల్లా జడ్జి పరిష్కరించగా.. బీమా కంపెనీ అధికారులు బాధిత కుటుంబానికి రూ.18 లక్షలు చెల్లించడానికి అంగీకరించారు.

బ్యాంక్ కేసుల లోక్ అదాలత్

జాతీయ లోక్ అదాలత్‌లో భాగంగా బ్యాంకులు దాఖలు చేసిన రుణ వసూలు కేసులను సత్వరమే పరిష్కరించాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి డాక్టర్ టి.శ్రీనివాసరావు సూచించారు. బ్యాంకు అధికారులు, ఆర్థిక సంస్థల ప్రతినిధులతో సమావేశమైన జిల్లా జడ్జి మాట్లాడుతూ రుణ వసూళ్ల నిమిత్తం దాఖలు చేసిన కేసుల్లో సాధ్యమైనంత తగ్గింపును ప్రకటించాలని తెలిపారు. దీంతో అధికారులు స్పందిస్తూ, కేసు ఆధారంగా బట్టి 50 నుంచి 75 శాతం వరకు తగ్గింపు ఇవ్వడమే కాకుండా వడ్డీ మొత్తాన్ని మాఫీ చేస్తామని ప్రకటించారు. ఈమేరకు కక్షిదారులు రాజీకి వస్తే వెంటనే లోక్ అదాలత్‌కు పంపాలని కోర్టులకు సూచించారు. న్యాయసేవాసంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్‌జడ్జి మహ్మద్ అబ్దుల్ జావీద్‌పాషా మాట్లాడుతూ లోక్ అదాలత్‌లో కేసు రాజీ చేసుకుంటే బ్యాంకులో తనఖా ఉన్న ధ్రువపత్రాలను వెంటనే తిరిగి ఇవ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో న్యాయవాదులు మువ్వా నాగేశ్వరరావు, స్వర్ణ రాంబాబుతో పాటు వివిధ బ్యాంకుల అధికారులు పాల్గొన్నారు.

వృద్ధురాలికి న్యాయం..

వృద్ధాప్యంలో తల్లికి ఆసరాగా ఉండాల్సిన కొడుకు ఆమె ఇంటిని లాక్కుని వెళ్లగొట్టగా.. న్యాయ సేవా సంస్థ ఇద్దరి మధ్య సయోధ్య కుదిర్చి న్యాయం చేసింది. రఘునాథపాలెంకు చెందిన లింగబోయిన ముత్తమ్మ నుంచి ఆమె కుమారుడు రామకోటయ్య ఇల్లు లాక్కుని వెళ్లకొట్టాడని న్యాయ సేవా సంస్థను ఆశ్రయించగా, న్యాయమూర్తి మహ్మద్ అబ్దుల్ జావేద్ పాషా వృద్ధురాలి కుమారుడికి నోటీసులు జారీ చేసి లోక్‌అదాలత్ ఎదుట హాజరుపరిచారు. ఈమేరకు వృద్ధాప్యంలో ఉన్న తల్లిని చూసుకోవాల్సిన బాధ్యతను వివరించగా కుమారుడు అంగీకరించడమే కాకుండా నెలకు రూ.1,500 ఇవ్వడానికి అంగీకరించాడు. అలాగే, ఇంట్లోని ఒక భాగాన్ని తల్లి కేటాయించగా, లోక్‌అదాలత్ అవార్డును ఆమెకు న్యాయమూర్తి అందించారు.

బొగ్గు ఉత్పత్తి పెంచండి

వీసీలో సింగరేణి సీఎండీ శ్రీధర్

సత్తుపల్లి/సత్తుపల్లి రూరల్: కొత్తగూడెం ఏరియాలో బొగ్గు ఉత్పత్తి, ఉత్పాదకతను పెంచి ఎక్కువ మొత్తంలో రవాణా చేసేలా చర్యలు తీసుకోవాలని సింగరేణి సీఎండీ ఎన్.శ్రీధర్ ఆదేశించారు. హైదరాబాద్ నుంచి గురువారం సింగరేణి అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. జనవరిలో గణనీయమైన ఉత్పత్తి సాధించడంపై అభినందించిన సీఎండీ.. రానున్న రెండు నెలలు కీలకమైనందున ప్రతిరోజు 2.50 లక్షల క్యూబిక్ మీటర్ల ఓబీ తొలగింపు, రోజుకు 49,500 టన్నుల బొగ్గు ఉత్పత్తి, రవాణా జరిగేలా పర్యవేక్షించాలని సూచించారు. ఈ సందర్భంగా సత్తుపల్లి జేవీఆర్ ఓసీ నుంచి వీసీకి హాజరైన కొత్తగూడెం జీఎం రమేశ్ మాట్లాడుతూ.. ఏరియాకు కేటాయించిన ఉత్పత్తి, రవాణా లక్ష్యాలను చేరుకుంటామని తెలిపారు.

కొమ్మేపల్లి కాలనీ సమస్యలు పరిష్కరిస్తాం..

అయ్యగారిపేటలోని కొమ్మేపల్లి ఆర్‌అండ్‌ఆర్ కాలనీలో సమస్యలను త్వరలోనే పరిష్కరిస్తామని సింగరేణి కొత్తగూడెం ఏరియా జీఎం జక్కం రమేష్ తెలిపారు. కాలనీలో గురువారం పర్యటించిన ఆయనకు స్థానికులు డ్రెయినేజీలు, రోడ్లు, వీధిలైట్ల సమస్యలను వివరించగా అన్నీ పరిష్కరిస్తామని, పాఠశాలలో బల్లలు సమకూరుస్తామని చెప్పారు. ఈకార్యక్రమాల్లో అధికారులు నారాయణరావు, సూర్యనారాయణ, ఎస్.వెంకటాచారి, ఎం.వీ.నర్సింహారావు, వై.రఘురాంరెడ్డి, సామ్యూల్ సుధాకర్, ఎం.రమేష్, రవీందర్, మోహన్, శేషశ్రీ, రమణారెడ్డి, దేవదాస్, విజయ్ సందీప్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

భారత నెట్‌బాల్ జట్టు శిక్షణ శిబిరం

ఖమ్మం స్పోర్ట్స్: నెట్‌బాల్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా సహకారంతో భారత యూత్ నెట్‌బాల్ బాలికల జట్టుకు ఖమ్మంలో శిక్షణ శిబిరం ఏర్పాటుచేసినట్లు నెట్‌బాల్ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి ఎస్.ఫణికుమార్, దీప్తి తెలిపారు. ఖమ్మంలోని సెయింట్ జోసఫ్ హైస్కూల్‌లో ఈనెల 1న మొదలైన శిబిరం 13వ తేదీన ముగుస్తుందని పేర్కొన్నారు. ఇక్కడ శిక్షణ పొందే జట్టు కొరియాలో జూన్ 10నుంచి జరిగే 12వ ఆసియా యూత్ నెట్‌బాల్ చాంపియన్‌షిప్ పోటీల్లో పాల్గొంటుందని తెలిపారు. ఇదే జట్టుకు రెండో విడత శిక్షణ హర్యానా రాష్ట్రం రోహతక్‌లో జరుగుతుందని వివరించారు.